# ఉపవాస ప్రార్థనా దీక్ష

ఓ విశ్వాసీ! ఎవరులేని నిశబ్ద స్థలమును, మంచి సమయమును ఏర్పరచుకొనుము. మొదటగా నీవు ఏర్పరచుకొన్న స్థలమునకు వచ్చి నీ గది తలుపులు వేసికొని పరిశుద్ధ గ్రంథములోని క్రొత్త నిబంధనయను భాగములో మొదటి పుస్తకమగు మత్తయి సువార్తలోని 5,6,7 అధ్యాయములు చదువుము.

మానవకోటిని రక్షించుటకై సృష్టికర్తయైన దేవుడు పాపలోకమున, జనన విధానమునకు విరుద్ధముగా నొక కన్యక గర్భమున జన్మించి, రక్షకుడను అర్థమిచ్చునట్టి యేసు అను బిరుదాంకితుడై, తనయొద్దకు వచ్చిన అనేక వేలమందికి ఒక కొండమీద కూర్చుండి బోధించిన నీతి సూత్రములు ఇందు కలవు.

పై అధ్యాయములలోని విషయములు మన దేశము కొరకు పాటుపడిన గాంధి మహాత్మునికి మిక్కిలి ప్రీతికరము. “నాయొద్దకు వచ్చువానిని నేను ఎంతమాత్రమును బైటికి త్రోసివేయను” అని యేసుప్రభువు చెప్పెను (యోహాను 6:37).

దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకు వారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా! (హెబ్రీ. 11:6) ఇట్టి నమ్మిక కలిగిన నీవు మోకరించుము. చేతులు జోడించి కన్నులు మూసికొనుము.

*ఎడమచేతి ప్రక్కన:* నీవు తలంచిన చెడుగు, చూచిన చెడుగు, విన్న చెడుగు, మాట్లాడిన చెడుగు, జరిగించిన చెడుగు, చెడ్డకలలు, ఇతరులను గూర్చిన పాపములు, చెడుగను మాటకు సంబంధించి యావత్తు చెత్తచెదారము పడవేసి, వాటిని పూర్తిగా మరచిపొమ్ము.

*కుడిచేతి ప్రక్కను:* నీవు చేసిన మంచి చేయవలెనని తలంచిన మంచి, చేయబోవు మంచి, ఇతరులను గూర్చిన మంచి, మంచి సంగతులు బైబిలులోని మంచి, మంచికి సంబంధించిన సమస్తమును వదిలివేసి, ఆ మంచి అంతటిని మరచిపోవలెను.

నీ వీపు వెనుక: వెనుకటి చెడ్డ, వెనుకటి మంచి అంతా ఆ వెనుకటి సంగతులను మరువుము.

*నీ ఎదుట:-* "నేను సదాకాలము మీతోకూడా ఉన్నాను" (మత్త. 28:20) అని చెప్పిన క్రీస్తు నీ యెదుట నిలువబడియున్నాడను ధ్యానము మాత్రము కలిగి నీ మనోనేత్రములతో ఆయనను చూచుటకు ప్రయత్నించుము. నీకు కనబడకపోయినను ఆయన నీ యెదుటనే ఉన్నాడని తలంచుము.

*నీ ఇంటి విషయములు:-* అనగా నీ భార్య, భర్త, బిడ్డలు ఇబ్బంది ఇల్లు, వాకిలి, ఆస్తి సంసార తాపత్రయములు మొదలగునవి జ్ఞాపకమునకు రానీయకుము.

*నీ ఒంటి విషయములు:-* అనగా శరీరములో నలత, మనసులో కలత, మతి నిబ్బరతనము, నగ, నాణ్యము, ఆకలి, దప్పిక, వస్త్రములు మొదలైనవి మరచిపోవలెను.

*నీ వెలుపటి విషయములు:-* అనగా తండ్రి, తల్లి, బంధువులు, స్నేహితులు, విరోధులు వారి కష్ట నష్టములు మొదలైనవి మనసులోనికి రానీయకుము.

మరియు లోకములోని గతకాల విషయములు నీ కాలములో జరుగుచున్న విషయములు, ఇక ముందునకు జరగబోవునట్టి విషయములు, నీకుగాని దేవునికిగాని, వేటికిగాని సంబంధించిన మంచి విషయములైనను సరే, చెడ్డ విషయములైనను సరే, నీకు కలసివచ్చే

విషయములైనను సరే, కలసివచ్చేవి కాకపోయినను సరే, నీ మనసును వాటి తట్టు ఆకర్షింపనీయకుము.

**మనోనిదానపు పని:-** దానియేలు, దేవుని యెదుట తన మనస్సు నిబ్బరము చేసికొనినట్లు నీ యెదుట దేవుడు ఉన్నాడనే విషయమును మాత్రమే నీ మనస్సునందును, నీ తలంపునందును, నీ జ్ఞాపకశక్తియందును ఆవరించుకొనియుండనిమ్ము (దాని. 9:3). నీవు నేలకు తిరిగి చేరువరకు నీ ముఖపు చెమటకార్చి ఆహారము తిందువు (ఆది. 3:19). ఆదాము ఆహారము నిమిత్తము చెమట కార్చవలసి వచ్చిన రీతినే ప్రార్ధనాది కార్యక్రమమును సాగించుటకై పని బూనిన నీవును ప్రార్ధనాంతము వరకు దానియేలువలె మనస్సు నిబ్బరముగా కుదుర్చుకొనుటకు ఆదామువలె చెమటకార్చి కష్టపడవలెను.

"ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్ధనచేయగా ఆయన చెమట, నేలపడుచున్న గొప్ప రక్త బిందువులవలె ఆయెను" (లూకా. 22:44).

మన రక్షకుడును ప్రభువైన క్రీస్తు గెత్సేమనే తోటలో ఉండగా ఆయన శిష్యులలో ఒకడైన యూదా ఇస్కరియోతు ప్రధాన యాజకులతోను దేవాలయపు అధిపతులతోను, పెద్దలతోను వచ్చి ముద్దుపెట్టి అప్పగించుటకు ముందు; పేతురు, యాకోబు, యోహాను ఆయన వెంట పెట్టుకొని వెళ్ళి అర్ధరాత్రివేళ తాను పొందనైయున్న శ్రమ మరణములను తలంచి ప్రార్ధన చేయుచుండగా, తన చెమట రక్తబిందువుల వలె కార్చిన క్రీస్తు నీ ఎదుట ఉన్నాడనే మనో నిబ్బరము కలిగియుండుటకు ఎంతైనను ప్రయాసపడు పని నీదే. దైవ సహాయము కోరుకొనుము. ఈ విద్యను అభ్యసించిన తర్వాత ప్రార్ధన చేయుము. ఫలితము పొందుము. ఇట్టి నిదానము కుదిరిన నీవు తండ్రిని స్తుతించుము.

షరా:- ఫోటో తీయునపుడు లెన్స్ (కెమేరా అద్దము) వైపు చూచునట్లుగా ప్రభువువైపే మనోనిదానముతో చూడవలెను.

**స్తుతి ప్రార్థన:-** సృష్టికర్తవును సర్వశక్తియునుగల ఓ దేవా! తండ్రీ! నా రక్షణకును, నా భక్తికిని ఆధారమైయున్న నీవు నా యెదుట ఉన్నావనే గురి కలిగించి కుదిర్చిన నీ గొప్ప శక్తిని స్మరించి వందనములు చెల్లించుచున్నాను. ఇట్టి దీక్షలో ప్రవేశించు నిమిత్తము కావలసిన స్థలమును అమర్చినావు. ఇందుకు నమస్కారములు. స్థలము మాత్రమే కాదు. కావలసిన సమయమును ప్రసాదించినందుకు నిన్ను స్తుతించుచున్నాను. నా ప్రార్థనా దీక్షను చెరుపుటకై వచ్చు విషయములన్నిటిని ఆపుచేయుటకై వచ్చు నీవు, యోబు చుట్టు కంచె వేసినట్లు నా చుట్టును నీ రక్తమును కంచెగా వేయుమని కోరుచున్నాను. ఈ ఉపవాస దీక్షను ప్రారంభించిన నాయందు మార్పు కలిగించి నూతనమైన అనుభవములో ప్రవేశపెట్టుము. నీ యందు విశ్వాసములో పెంపారునట్లు కృప చూపుము. నీ శిష్యులలో ఒకరైన పేతురు నీ మాట చొప్పున నీళ్ళమీద నడుచుచు, గాలినిచూచి భయపడి మునిగి పోసాగిన రీతిగా నేను నీ గురినుండి తొలగిపోకుండ ప్రార్థనాంతము వరకు నీవు ఉన్నావను దీక్షతో నడుపుదువని యేసు నామమున వందించుచున్నాము. ఆమేన్.

"సైన్యములకు అధిపతియగు యెహోవా పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు సర్వలోకము ఆయన మహిమతో నిండియున్నది" యెషయా 6:3. మీరు పరిశుద్ధులై యుండవలెను. మీ దేవుడనైన యెహోవానగు నేను పరిశుద్ధుడనైయున్నాను. లేవి. 19:2; 1పేతు. 1:14-16; 1థెస్స. 4:7.

హృదయము అన్నిటికంటె మోసకరమైనది. అది ఘోరమైన వ్యాధి కలది. దానిగ్రహింపగలవాడెవడు? యిర్మీ. 17:9. (మార్కు. 7:21-23).

ప్రతివాడును తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి మరులు కొల్పబడినవాడై శోధింపబడును. దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును (యాకోబు 1:14-15).

నాయందు అనగా నా శరీరమందు మంచిది ఏదియు నివసింపదని నేనెరుగుదును. మేలైనది చేయవలెనని కోరిక నాకు కలుగు చున్నదిగాని దానిని చేయుట నాకు కలుగుటలేదు. నేను చేయగోరు మేలు చేయక చేయగోరని కీడు చేయుచున్నాను (రోమా. 7:18-19).

మీ దోషములు మీకును మీ దేవునికి అడ్డముగా వచ్చెను (యెష. 59:1) పరిశుద్ధ దైవసన్నిధిని మోకరించిన నీవు నీ కోరికను బైలుపరచక ముందే నీ పాపస్థితిని, అయోగ్యతా స్థితిని, ఒప్పుకొని క్షమాపణ భాగ్యమును శుద్ధీకరణానందనమును పొంద ప్రయాసపడుము. కయీనువలె పాపమును తెలిసికొనని మనస్సాక్షిని కలిగియున్నావా? యోసేపు సహోదరులవలెను, దావీదువలెను, యూదా ఇస్కరియోతువలెను పాపమును తెలిసికొనునట్టి మనస్సాక్షిని కలిగియున్నావా? లేక వాతవేయబడిన మనస్సాక్షి కలిగియున్నావా? లేక పాపముచేసి దానిని గూర్చిన తలంపే లేక మరచిపోయి ఉన్నావా? ఆది. 4:13; 50:17; 1సమూ. 24:5; 2సమూ. 12:13 మత్త. 27:3; 1తిమో. 4:3.

ప్రార్థన:- పరిశుద్ధుడువైన దేవా! నా పాపమును నా అయోగ్యతా స్థితిని జ్ఞాపకముచేసి, వాటిని ఒప్పింపచేసి వాటిని విడిచిపెట్టుటకు శక్తినిమ్ము. నీ పరిశుద్ధాత్మ సహాయము వలననే ఇట్టి మార్పు నా అంతరంగమున జరిగించుదువని నమ్ముచు యేసుప్రభువు ద్వారా వినయముతో వేడుకొనుచున్నాను. ఆమేన్.

అందుచేత పాపమును గూర్చియు, నీతిని గూర్చియు, తీర్పును గూర్చియు ఆయనే ఒప్పుకొనజేయును. యోహా. 16:8; ఎజ్రా 9:6,7,15; కీర్తన. 106:6.

Bible Mission HQ Guntur

ప్రార్థనా దీక్ష కార్యక్రమమును సాగించుటకు పనిబూనిన నీవు సమస్త పాపములనుండి విడుదలపొంది, పరిశుద్ధ పరచబడి, ఈ శరీరములో నుండు కాలమునందే మనసానందము పొందుటకును, శరీరేచ్ఛలమీదను, లోకేచ్ఛలమీదను, పాపేచ్ఛల మీదను, సైతానుయొక్క సర్వతంత్రోపాయములమీద, జయము పొందుటకును ప్రార్థనయొక్క ఫలితమును చూచుటకై నిర్ణయ స్థలమునందు మోకరించియున్న నీవు నీ అంతరంగమును పరీక్షించుకొనుము. ఈ దిగువ వ్రాయబడిన పాపముల జాబితాను చదివి దైవసన్నిధియందు నీ పాపమును ఒప్పుకొనుము. హృదయాంతరంగములను పరీక్షించు దేవుడు నీ సమస్త పాపములను క్షమించి నిన్ను విడిపించుటకై యేసు క్రీస్తుగా తానే కొరత వేయబడి సిలువపై చిందించిన ప్రశస్త రక్తమే నీకాధారమై యున్నది కీర్తన. 51:1-10, 139 అధ్యా.

**దుఃఖ భాష్పముల ధ్వని:-** నా పాపకార్యముల వలన పరలోకపు తండ్రి మనస్సును ఆయాస పెట్టితిని గదా యని వాటిని ఒప్పుకొను సమయమున నీ హృదయము నిండా వేదనయు, బాధయు కలిగి కన్నీరు కార్చవలయును.

నీవు రక్షింపబడునట్లు నీ హృదయములోనుండి చెడుతనము కడిగి వేసికొనుము. యిర్మి. 4:14.

నీ జీవితములో దేవునికంటె ఎక్కువగా దేనిని లేక వేటిని, ఎవరిని తలంచుకొనుచున్నావో లేక ఎంచుకొనుచున్నావో లేక చూచుకొనుచున్నావో లేక ప్రేమించుచున్నావో ఒకసారి దుర్భిణీవేసి పరీక్షించి చూడుము. తల్లిదండ్రులనా, భార్యనా, భర్తనా, బిడ్డలనా, పొలమునా, పంటనా, పశువులనా, పాడినా, ఇంటినా, ఒంటినా, నగలనా,

వస్త్రములనా, ఆస్థినా, గౌరవమునా లేక సౌఖ్యమునా దేనిని దేవునికంటె ఎక్కువగా ప్రేమించుచున్నావో!

మరియు ఆకాశములో ఉన్న సూర్యచంద్ర నక్షత్రాదులను, భూమి, చెట్టు, గంగ, గాలి అను వాటినైనను మన్ను, కర్ర, ఇనుము, ఇత్తడి, రాగి, వెండి, బంగారముతో తయారుచేయబడిన ప్రతిమలనైనను పూజింపరాదు. వారు అక్షయుడగు దేవుని మహిమను క్షయమగు మనుష్యుల యొక్కయు పక్షులయొక్కయు, చతుష్పాద జంతువుల యొక్కయు, పురుగుల యొక్కయు ప్రతిమా స్వరూపముగా మార్చిరి. ఆది. 1:26-28; కీర్తన. 115:4-7; యెష. 46:6,7; రోమా. 1:23లో ఉన్నట్లు సృష్టిని ఏలవలసినను మనిషి సృష్టిని పూజించుట చాలా విషాదకరము. ఇది పాపములన్నిటికంటె గొప్ప పాపమని నీకు తోచుటలేదా! దేవునికంటె వానిని కొంచెము తక్కువవానిగా చేసియున్నావు. మహిమా ప్రభావములతో వానిని కిరీటము ధరింపజేసియున్నావు. నీ చేతిపనుల మీద వానికి అధికారమిచ్చియున్నావు (కీర్తన. 8:5,6).

ఆపత్కాలమందును, జబ్బుకాలమందును, మరణదశయందును, పంటమొన కాలమందును, విత్తనవెద కాలమందును, పంటకోత కాలమందును, దేవుని సహాయము కోరక, దేవతల పేరున కొబ్బరికాయలు కొట్టుట, కోళ్ళయొక్కయు మేకపోతుల యొక్కయు రక్తము చిందించుట, సంభ్రములు చేయుట, కుంభములు పోయుట, చనిపోయిన పెద్దల పేరున అన్నము పెట్టుటయు, సోదె చెప్పించుకొనుట, శకునములు చూపుట, తిథులు, గడియలు పాటించుట, తురపములు, తావీదులు, రక్షరేకులు, భూతములకు సంబంధించిన దండ కడియములు, పద్ధములు, సాముద్రికము, గారడీ మంత్ర తంత్రములు మొదలైనవి చేయకూడని పనులైయున్నవి. యెష. 47:9-15; ప్రక. 21:8; 22:15.

బీదలకు ధర్మము చేయుట అను ధర్మబుద్ధి మంచిదేగాని దాని వలన రక్షణ దొరకదు గుళ్ళు, గోపురములు, సత్రములు, వైద్యశాలలు, పాఠశాలలు కట్టించుట ఇవి ఉపకార కార్యములే గాని వీటివలన రక్షణ దొరకదు. దైవ విషయములుండు గ్రంథములు వల్లించి, ధర్మోపదేశము చేయుట, భక్తి మార్గకృత్యములేగాని వీటివలన రక్షణ దొరుకదు. జీవరాసులకు మేతపెట్టుట, ఇది మేలైన పనియేగాని రక్షణ మాత్రము దొరకదు. మహానుభావులను ఆశ్రయించుట, దేవస్థానములను చూచి వచ్చుట, ఏ సత్కారము చేసిన యెడల రక్షణ దొరుకునని తోచునో ఆ సత్కార్యముల వలన రక్షణ దొరుకునని తలంచరాదు. చనిపోయిన వారిపేరున భూదానము, గోదానము, సువర్ణదానము, వస్త్రదానము, అన్నదానము మొదలగునవి జరిగించుట ధర్మకార్యములేగాని మోక్ష సాధనములు కావు. ఇట్టివి చనిపోయిన వారి పేరున దానములిచ్చుట వ్యర్ధ కార్యములైయున్నవి.

మా నీతి క్రియలన్నియు మురికి గుడ్డవలెనాయెను (యెష. 64:6).

మరియు భక్తిలేకుండ బైబిలు చదువుట, సరదాగా బైబిలు వాక్యములు ఎత్తి మాట్లాడుట, ప్రేమ ఉత్తరములలో బైబిలు వాక్యములు వాడుట, వేడుకకు ఆయన వాక్యము వినుట; ఇవి దేవునికి అనిష్టములు. దెబ్బతగిలినప్పుడు, ఉలికి పడినప్పుడు, ఆవలింతలు వచ్చినప్పుడు, ఆశ్చర్యకరమైన సంగతులు, విచారకరమైన సంగతులు చెప్పుకొన్నప్పుడు మరియు వినునప్పుడు అలవాటును బట్టి దేవునిపేరెత్తుట దేవదూషణయై యున్నది. గనుక ఒప్పుకొని విడిచిపెట్టుము.

కోర్టులలోను, న్యాయసభలలోను, పంచాయితీలలోను దేవుని పేరెత్తి ప్రమాణములు చేయుట, ఉన్నవి లేనట్లుగాను లేనివి

ఉన్నట్లుగాను చెప్పుట, ఒట్టుపెట్టుకొనుట, సగము సత్యము, సగము అబద్ధము పలుకుట, ఇతరులకు కీడు రావలయునని కోరుట, కీడు వచ్చు నిమిత్తము దేవునిని ప్రార్ధించుట, వారిని శపించుట తనకు తాను శపించుకొనుట, విరోదుల క్షేమము నిమిత్తమై ప్రార్ధింపకపోవుట; ఇవియు కూడని పనులే (లూకా. 6:27,28).

విశ్రాంతి దినమున పనులు ఎక్కువ కల్పించుకొనుట, ఆరాధనకు ఆలస్యముగా వెళ్ళుట, వెళ్ళినను పరధ్యానము కలిగియుండుట, సగము ఆరాధనలోనుండి వచ్చివేయుట, అసలే ఆరాధనకు వెళ్ళకపోవుట, లోకవార్తలు చెప్పుకొనుట, వార్తా పత్రికలు చదువుట, బైబిలు చదువకపోవుట, ప్రార్ధనలు చేయకపోవుట; ఇవన్నియు విశ్రాంతి దినమును మీరినట్టే. గనుక తప్పు ఒప్పుకొనుము (యెషయా 58:13,14).

పిల్లలారా! అన్ని విషయాలలో మీ తల్లిదండ్రుల మాట వినుడి (కొలస్స. 3:20). తల్లిదండ్రులను, పెద్దలను, గౌరవనీయులను, మన్నన చేయకపోవుట, మురాబితనముగా జవాబిచ్చుట, విచ్చల విడిగా తిరుగుట, తల్లిదండ్రులకు కోపము పుట్టించు పనులు చేయుట, కోపము, తాపము, అసూయ, కలహము, వైరము, తిండిబోతుతనము, తిరుగుబోతు తనము, పొగరుబోతు తనము పోకిరితనము, ఓర్వలేనితనము, కసి తీర్చుకొనుట, పగతీర్చుకొను గుణము కలిగియుండుట, తుచ్ఛబుద్ధి కలిగియుండుట, ఆశా పాతకము, చేసిన పాపమును దాచి పెట్టవలెనను కోరిక, క్రొత్తగా పుట్టిన చంటిబిడ్డ ప్రాణమునైనను, ఇంకను పుట్టని శిశువు ప్రాణమునైనను నిర్మూలముచేయుట, ప్రాణ భంగమునైనను, హానినైనను తెచ్చిపెట్టునట్టి అక్కరమాలిన పనులు

చేయుట, ఆయుష్షును తగ్గించు త్రాగుడు అలవాటు కలిగియుండుట, ఇవి ఇతరులకు అబ్బునట్లుగా వారిని ప్రేరేపించుట, ఊపిరాడకుండ పనులు చెప్పి హింసించుట, ఎవరినైనను కష్టపెట్టుట అనవసరముగా నిన్ను నీవు కష్టపెట్టుకొనుట, ఏక చక్రముగా దుఃఖపడుట, ఇతరులను దుఃఖపెట్టుట, ఎవరికైనను హాని కలుగునని తెలిసియు చెప్పకపోవుట, కష్టకాలమందు సహాయము చేయు శక్తి కలిగియు సహాయము చేయకపోవుట, గతించిన విషయములను తలంచుకొని మనోవ్యాకులము కలిగి క్షీణించిపోవుట, అనవసరముగా తొందరగొని అపాయములోపడుట, అన్నీనావే అని కల్పించుకొని తనకు తానే కొన్ని చిక్కులు తెచ్చిపెట్టుకొనుట, ఆ చిక్కులవలన మనస్సు చలించి పిచ్చితనముగా తిరుగుట, జబ్బు వచ్చినప్పుడు తగిన చికిత్స చేయించుకొనకపోవుట, అందువలన జబ్బు ముదరబెట్టుకొనుట, అసలు ఏ ఔషము వాడకపోవుట, ఆరోగ్యమునకు సంబంధించిన ఏ పద్ధతులను అవలంభించకపోవుట, వాటిని నిరాకరించుట, ఇవి నరహత్య పాపములైయున్నవి. ఒప్పుకొని విడిచిపెట్టుము (2కొరింథి. 5:10,11).

శరీరకార్యములు స్పష్టమైయున్నవి. అవేవనగా జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషము, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితోకూడిన ఆటపాటలు మొదలైనవి. వీటినిగూర్చి నేను మునుపు చెప్పిన ప్రకారము ఇట్టి వాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరని మీతో స్పష్టముగా చెప్పుచున్నాను (గలతీ. 5:19-21). వ్యభిచారిణిని చూచి

ఆశించుచు పాపము మానలేని కన్నులు గలవారును, అస్థిరులైన వారి మనస్సులను మరలుకొల్పుచు లోభిత్వమందు సాధకము చేయబడిన హృదయముగలవారును, శాపగ్రస్తులునై యుండి తిన్నని మార్గమును విడిచి బెయోరు కుమారుడైన బిలాము పోయిన మార్గమునుబట్టి త్రోవ తప్పిపోయిరి (2పేతురు 2:14,15).

ఒక స్త్రీని మోహపుచూపులతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసిన వాడగును.

మన తలంపులోనికి అపవిత్రతను, చెడు కోరికను రానిచ్చుట, దానిని మనస్సులో పెట్టుకొని మురియుట, దానిని రూపుమాపుటకు ప్రయత్నింపకపోవుట, సరసపుమాటలు, పాటలు, దుర్నీతి కథలు, సిగ్గుమాలిన పరిహాస్యకములు, సంభాషణలు కాని జతలు, మరియు ఇతర పుస్తకములు (నవల్సు), పత్రికలు చదువుట, బూతుబొమ్మలు చూచుట, అవి ఇంటిలో పెట్టుకొనుట, నీతివిడచి పెట్టిన ఆట చూచుట, ఆడుట (సినిమా), అల్లరితో కూడిన ఆటలు మొదలైనవి. దేహము జారత్వము నిమిత్తముకాదు ప్రభువు నిమిత్తమే.

వ్యభిచార కారణమునుబట్టి కాక తన భార్యను విడనాడు ప్రతివాడు ఆమెను వ్యభిచారిణిగా చేయుచున్నాడు. విడనాడబడిన దానిని పెండ్లాడువాడు వ్యభిచరించుచున్నాడు (మత్త. 5:32).

భర్త భార్యను దాసీవలె చూచుట, ఒకరినొకరు నమ్మక పోవుట, వారిలో వారికే పడకపోవుట, ఒకరి కష్టములో ఒకరు పాల్గొనకపోవుట, ఈ మొదలైనవి ఐక్యతకు భంగము కలిగించు పనులు చేయుటకూడ పాపములైయున్నవి.

భార్యలారా! మీ భర్తలకు విధేయులై యుండుడి. ఇది ప్రభువునుబట్టి యుక్తమైయున్నది. భర్తలారా! మీ భార్యలను ప్రేమించుడి. వారిని నిష్టూరపెట్టకుడి (కొలస్స. 3:18).

జారత్వమునకు దూరముగా పారిపోవుడి. మనుష్యుడు చేయు ప్రతి పాపము దేహమునకు వెలుట ఉన్నది గాని జారత్వము చేయువాడు తన స్వంత శరీరమునకు హానికరముగా పాపము చేయుచున్నాడు (1కొరింథి. 6:18).

మన పొరుగువాని సొమ్మైనను, సొత్తైనను దొంగిలించుట, దోపుడు, దొంగతనము, కన్నమువేయుట, దాచిబెట్టినది అపహరించివేయుట, తప్పు పత్రములు పుట్టించుట, చోరీ, ఆస్తిని దాచుట, దొరికిన వస్తువులు దాచుకొనుట, అరువు తెచ్చుకొన్నవి మరల ఇవ్వకుండుట, పన్ను తప్పించుకొనుట, అప్పు తీర్చకుండుట, పని ఉన్నను బద్ధకించి చేయకుండుట, పనిచేయు శక్తి ఉండియు బిక్షమెత్తుకొనుట, పందెములు వేయుట, జూదమాడుట, లాటరీ, మరియు చీట్లువేయుట, లంచములు పుచ్చుకొనుట, అక్కరమాలిన వ్యాజ్యములలో తిరుగుట, ఇతరుల వ్యాపారములలో పనిచేసిపెట్టుటయందు అశ్రద్ధగా ఉండుట, టిక్కెట్లు కొనకుండ బండ్లలో ప్రయాణముచేయుట, పని నమ్మకముగా చేయకపోవుట, కష్టమునకు తగిన జీతమియ్యకుండుట, ఇతరుల ఇబ్బంది సమయము కనిపెట్టి సరుకెక్కువ ధరకు అమ్ముట, ఎక్కువ వడ్డీ కట్టుట, సరకులలో ఏదైనా కలుపుట, సిసలుకాని పిచ్చపడులతో కొలచుట, తమ పశువులను ఇతరుల చేలలోనికి తోలుట, సరిహద్దు రాళ్ళను తీసివేయుట, చేలగట్టు దున్నుకొనుట, దురాశ, దూబరితనము కూడదు (ద్వితీ. 16:19,20; 6:10) ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము (1తిమో. 6:10). ఉపకారమును ధర్మమును చేయ మరచిపోకుడి. అట్టి యాగములు దేవుని కిష్టమైనవి (హెబ్రీ. 13:6).

ఒకనితో ఒకడు అబద్ధమాడకుడి (కొలస్స. 3:9). పెదవులు యెహోవాకు హేయములు సత్యవర్తనులు ఆయన కిష్టులు (సామె. 12:22). చెడ్డమాటలు పలుకకుండను నీ నాలుకను కపటమైన మాటలు పలుకకుండ నీ పెదవులను కాచుకొనుము (కీర్త. 34:13) మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతిమాటను గూర్చియు విమర్శ దినమున లెక్కచెప్పవలసియుండును (మత్త. 12:36).

పైకి స్నేహితునివలె నటించుచు ఒకరిని పట్టి ఇచ్చుట న్యాయసభవారుగాని, తల్లిదండ్రులుగాని, సంగతి తెలిసికొను హక్కుగల మరియెవరుగాని, నిజస్థితినిగూర్చి మనలనడిగినప్పుడు వారినిగూర్చి మనకు తెలిసినదంతయు దాపరికము లేకుండ చెప్పకపోవుట, కొండెగాడై తిరుగులాడుట, లేనిపోని వదంతులు పుట్టించుట, ఒకరి మంచిపేరు చెడగొట్టుట, అందుకు ప్రయాసపడుట, మన పొరుగువాడు చేయు దానినిగూర్చి మంచిభావము కలిగియుండక పోవుట, పెడర్థము చేసికొనుట, లేనిపోని ఊహలు, అనవసరమైన తలంపులు కలిగియుండుట, ఇవన్నియు పాపములైయున్నవి మన పొరుగువాని గురించి మంచి మాటలాడ లేనియెడల, ఎంతో అంత అవసరమైతేనే తప్ప అతని గొడవ ఎత్తకుండుటయే మంచిది.

మన పొరుగువానికి కలిగినది మనకున్న యెడల బాగుండుననుకొనుట యుక్తి, టక్కు, మోసము, తంత్రోపాయముల వలన మన పొరుగు వానికి కలిగినది సంపాదింప ప్రయత్నించుట, అట్టి కోరిక కలిగియుండుట, దేవుని దృష్టికి న్యాయముగా ఉండక పోయినను మనుష్యులు కల్పించిన చట్టములచేత అన్యాయము న్యాయమని సాధించి, దాని నాకయించు కొనుగోరుట, మన

పొరుగువాని భార్యనైనను అతని సేవకులనైనను, పశువులనైనను లాలన చేసికొని, ఇచ్చకము లాడికాని అబద్ధము చెప్పిగాని, బలవంతము చేసికొనిగాని విడదీయుట, దూరపరచుట, ఇవి కూడని పనులైయున్నవి (నిర్గ. 20:1-17).

మరియు అలుగుట, గొణుగుట, చెలగుట, ముక్కుట, మూల్గుట, మంకుట, జంకుట, కంకుట, చిరబొరలాడుట, చిందెలు ద్రొక్కుట, గప్పాలు గొట్టుట, చింత, చివుకు, చిరాకు, గిరాకు, పరాకు, తంటాల మారితనము, పిసినారితనము, సిగ్గుమాలిన తనము, సోమరితనము, పెంకితనము, మంకుతనము, వేళాకోళము, వెక్కిరింతలు, కత్తిపోటులవంటి మాటలు పలుకుట, మరియు మనస్సును ఆయాసపరచునవి మనస్సును చెరుపునట్టి విషయములను పదేపదే తలంచుకొనుట, మొక్కనుండి త్రుంచిన పుష్పము రీతిని కష్టనష్టములకు త్వరగా వాడిపోవుట, అందువలన దేవుని పోలికగా సృష్టించిన మనిషిని దూషించుట, శ్రమలకు శోధనకు ఇరులు ఇబ్బందులకు నలిగి అలిగి దేవునిమీదనున్న మంచి అభిప్రాయమునుండి తొలగిపోవుట, మరియు వాటివలన అరగి కరగి వారిమీద, వీరిమీద సబబు సందర్భము లేకుండ రుసరుసమంటూ, పగబట్టిన త్రాచువలె బుసగొట్టుచు పొరలు గ్రమ్మిన సర్పరీతిని, కన్నుమిన్ను గానకుండ చిన్న, పెద్దకానక, గురువు దైవము అనక, చెలాం చిందెలు ద్రొక్కుచు, తిరిగులాడుట పాపమని నీకు తోచుటలేదా? వీటిన దైవ సన్నిధిలో ఒప్పుకొని విడిచిపెట్టుము (ఎఫెసీ. 4:31).

**సందేహము:-** అనగా అవిశ్వాసము, వెనుకాడుట, ఇది నిజమా! అని అనుమానించుట, మోక్షనరకమనునవి నిజమా! అని

అనుమానపడుట పాపమే గనుక వీటిని ఒప్పుకొని వాటినుండి తప్పుకొనుము.

**అనిశ్చయము:-** బైబిలు సంగతులు అందరు అన్ని విధములుగా బోధించుచున్నందున ఎవరిబోధ నిజమో నిశ్చయము తెలియని స్థితి కలిగియుండుట, అది నెరవేరలేదు అను చింత కలిగియుండుట, అది లేదు ఇదిలేదు, దానికి కొరత దీనికి కొరత అని అనుకొనుట, తృప్తిలేకపోవుట, ఇట్టి పేద అరుపులు కూడ పాపమునకు సంబంధించినవే. మరియు చిరచిరలాడుట, నిష్కారణ కోపము, మందస్థితి కలిగియుండుట, మతబోధ విన్నప్పుడు పాప స్థితిని తెలిసికొనియు నిర్లక్ష్యముగా నుండుట పాపమువల్ల కష్టములు, మరణము, నరకము అని విన్నప్పటికిని లెక్కలేకుండుట, మోక్షములో మహిమ ఉన్నదని విన్నను ఆశలేకుండుట, ఎన్ని తప్పులు చేసినను దేవుడు క్షమించునుగదా! అనుకొని విచ్చలవిడిగా తిరుగుట, అనగా కృపను లోకువ కట్టుట, నెరవేర్చవలసిన విధులను నెరవేర్చకుండుట, పొందినమేలు గుర్తెరిగి ఉపకారులను మరచుట, దేవునియెడల కృతజ్ఞతలేకుండుట, మోసము చేయవలెననియు, మరియు అబద్ధమాడవలెననియు దంద్వార్థముగా మాటలాడుట ఇవి దేవునికి అనిష్టములైయున్నవి. కావున నన్ను నేను అసహ్యించుకొని ధూళిలోను, బూడిదలోను పడి పశ్చాత్తాప పడుచున్నాను (యోబు 42:6). వీటిని ఒప్పుకొని విడుదల పొందుటకై ప్రభువును రక్షకుడునైన క్రీస్తు పాదములు పట్టుకొనుము. క్రీస్తుయొక్క రక్తము నిర్జీవ క్రియలను విడిచి జీవముగల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో ఎక్కువగా శుద్ధిచేయును (హెబ్రీ. 9:14).

## ప్రకటన 21:8

**1. పిరికివారు:–** క్రీస్తునుగూర్చి సాక్ష్యమిచ్చుటకు, భక్తిగా యుండుటకు భయపడుట, గొప్పవారికి భయపడి బీదవాని పక్షముగా సాక్ష్యమిచ్చుటకు భయపడుట, గొప్పవారికి భయపడి న్యాయసాక్ష్యమివ్వకుండుట, మరియు శోధన వస్తే జయించుటకు భయపడుట. **2. అవిశ్వాసులు:–** వీరి చర్యలు అపనమ్మకమైనవి. ఏమియు లేవని పరలోకముమీద, బైబిలుమీద, దేవునిమీద, తుదకు నరకముమీద వారియందు వారికే నమ్మకముంచరు. **3. అసహ్యులు:–** విగ్రహారాధనయొద్ద జరిగే అసహ్యకరమైన సంగతులు. ఉదా: ఊరిలో విగ్రహారాధన యొద్ద అన్నము వండి, ఎన్నిరోజులు పండుగో అన్ని రోజులు ఆ మొదట వండిన అన్నములోనే పోసి తిందురు. దేవుని ప్రసాదమని, పాపాచారములు మొదలైనవి చేయుదురు. **4. నరహంతకులు:–** ఎక్కువ తినుట, గతిలేక (శక్తిలేక) గంజిత్రాగుట, జబ్బువస్తే మందులు వేసికొనక చనిపోవుట, ఇతరులను చంపుట, తన్నుతాను చంపుకొనుట, కోపము, పగసాధించుట, మొదలైనవి. నరహత్యకు సమానము. **5. వ్యభిచారము:–** భార్యభర్తల కలహములు, కొట్టుకొనుట, తిట్టుకొనుట మొదలైనవి. **6. మాంత్రికులు:–** మంత్రాలు చెప్పించుకొనుట, ఇది మోషేకాలములో ఎక్కువ జరిగెను. ఇప్పుడున్నవిగాని ఎక్కువగా పారవు, కొన్ని మాత్రము అవి ప్రభువు నామమున నశించినవి. భయపడకుము. ప్రార్థనే ఖడ్గము అవి ఎగిరిపోవును. **7. విగ్రహారాధన:–** దేవునికంటె ఎక్కువగా తన్నుతాను ప్రేమించుకొనుట, తనవారిని ప్రేమించుకొనుట, పాలేరు యజమానినే ఎక్కువగా ఎప్పుడు మ్రొక్కుట మొదలైనవి.

**8. అబద్ధికులు:-** పిల్లవాడు బెదిరించుట అబద్దములు చెప్పుట, కోర్టులలో అబద్ధములాడుట, కష్టాలనుబట్టి ఎరుగకపోయి మతములోనికి వచ్చారనుట, దేవునియెడల బొంకుట.

**బూసోడు వచ్చాడనుట:-** ఈ మాట ఎందుకు వాడుదుమనగా పూర్వము భీకరుడైన దొరగారు "బూసిదొరని" యుండెను. బూసిదొరగారు వస్తున్నారన్న మాటవినగానే పిల్లలు దాగువారు గొడవలు చేయువారు ఆపుదురు. అది ఇప్పటికి అలవాటుగానే వాడుచున్నాము. అది మారిపోయి ఇప్పుడు బూసివాడు అని పిల్లలకు చెప్పుచున్నారు. అలాగే కల్లు త్రాగడానికి వస్తుండగా ప్రభువు వర్తమానము త్వరలో వస్తున్నది. పై పాపాలలో ఒకటైన ఉన్న (1) మారుమనస్సు లేనట్టే (2) రక్షణ లేనట్టే, (3) మోక్షము లేనట్టే (4) పెండ్లికుమార్తె వరుసలేనట్టే, ప్రార్ధనయొక్క ఫలితము పొందలేము.

**దట్టి=సత్యము=చెల్లుబడి:-** గవర్నమెంటువారి దట్టికట్టు కుంటె గొప్ప అధికారము సూచించును. నేను క్రీస్తు పక్షముగా యున్నాను. యేసుప్రభువు సైన్యాధిపతియైయున్నాడు. దట్టి (1) నడుమునకు బలముగానుండుటకు (2) జారిపోకుండుటకు (3) అలంకారమునకు (4) తిన్నగా నిలువబడుటకు (5) అధికారమునకు ధరింతురు. మనము సాతానుతో పోరాడవలెను గనుక దట్టి ధరించవలెను ముందుకు సాగవలెను.

సత్యమనగానేమి? దేవుడు దేవుడుగా నుండక మనిషైనాడు. నిజముగా దేవుడు, నిజముగా మనిషియైనాడు. ఆయనే యేసుప్రభువు. ఇదియొక సత్యము. ఇదే మన నడుమునకు బలము, నేను ఏది నమ్ముచున్నానో అదే సత్యము. బైబిలు గ్రంథములో మొదటినుండి చివరి వరకు ఏమి వ్రాయబడియున్నదో అదంతా సత్యమని

నమ్ముచున్నాను. నేను, సాతాను, లోకము, శరీరముతో యుద్ధము చేయునప్పుడు దేవుడు మనిపైనాడనియు, బైబిలును నమ్ముచున్నాను గనుక యేసుప్రభువు ఇవన్ని జయించినాడు గనుక నాకు జయము నిచ్చును అని నమ్ముచున్నాను గనుక ఇది ఒక సత్యము.

**2) మైమరవు=నీతి:-** శరీరమంతటిని కప్పు వస్త్రము గనుక మైమరవు. లోపల శరీరమునకు హాని రాకుండ కాపుదలగాయున్నదే మైమరువు.

**3) నీతి అనగా నేమి?:-** ఏమిలేదో అది ధరించుకొనుట క్రీస్తుచూపులోను, క్రియలోను, వినికిడిలోను, మాటలోను, పాపములేకుండా ఉన్నాడు. ఇదే ఒక నీతి స్వభావము. ఆయన లోకములో సంచరించినప్పుడు ఆయన బ్రతుకంతటిలో జయము పొందినాడు (ఇదే ఒక నీతి బ్రతుకు).

ఆయన పాపములేనివాడుగా నుండెను. ఆయన పరిశుద్ధత ఆయన బ్రతుకులో మనకొరకు చూపించెను. గనుక ఇది ఒక నీతి. ఇది మనము సంపాదించిన నీతిగాదు, ఆయన మనకొరకు అనుగ్రహించిన నీతి. విశ్వాసమువల్ల మనదైనట్లు మనము ఆ నీతిని ధరించుకొనవలెను. పాదిరిగారు ఒక స్త్రీతో మాట్లాడి, పాపిని అని ఆమె అనునట్లు ప్రయత్నించుట. దొరగారు తన కుమారుని బట్టి బట్లరుకు పని ఇచ్చుట.

**4) సిద్ధమనస్సు=జోడు:-** సిద్ధపడేజోడు నేను సిద్ధముగా యున్నాను. క్రీస్తు పిశాచితో జయించుట- అంటే అదే సిద్ధపడుట. దేనివలన మనము సిద్ధము కాగలము?

సువార్తను బట్టి క్రీస్తు నా కొరకు నీతిని సంపాదించినాడు అనే సంతృప్తి, సమాధానము, మనకు కలిగినప్పుడు, మనము

సిద్ధపడగలము (Soldier) శత్రువులు కాల్చబోవుచుండగా యుండుడి, నేను (Dress) వేసికొని వస్తానని చెప్పి (Dress) తో వచ్చి సిద్ధపడుట అప్పుడు శత్రువులు కాల్చివేసిరి. సిద్ధపడి చనిపోయినాననే సంతోషము గలదు

**5) డాలు =విశ్వాసము:–** బాణము తగులకుండ దీనివలన దుష్టుని అగ్ని బాణములు ఆపుదురు. అగ్నిబాణములు = బాంబులు, ప్రతిశోధన, అగ్నిబాణమువంటిదే. దిగులు, దుడుకు, ఉడుకు, పిశాచియొక్క పనులలో ఒకపని భయపెట్టుట, ప్రభువు నన్ను తప్పిస్తాడు కాపాడుతాడనే నమ్మిక విశ్వాసము.

**6) శిరస్త్రాణము =** రక్షణ: తలకు దెబ్బతగులకుండ యుద్ధ సిపాయిలను జాగ్రత్తగా యుండుడని హెచ్చరించుదురు. రక్షణ అనగానేమి?:– చేతిమీద పుండు ఉన్నది. అదిపోయినదని నమ్మిన తరువాత పోవును. ఆ జరిగిన వృత్తాంతమే రక్షణ. విశ్వాసము వేరు, వృత్తాంతము వేరు. రక్షణ పొందిన తరువాత పైవన్ని వాటంతటవే వచ్చును. ఒకరు పటాలములోనికి వెళ్ళుటకు పేరు వ్రాసికొన్నప్పుడు తక్కిన వస్తువులు అవి వాటంతటవే వచ్చును.

**7) ఖడ్గము=వాక్యము:–** పైవన్ని పోగొట్టుకొనకుండ ఖడ్గము. దేవుని మాటలు మనకు కనబడవు, వినబడవు. దేవుని వాక్యమును పరిశుద్ధాత్మ తండ్రి విశ్వాసులకిచ్చును.

**బైబిలు:–** బైబిలు సొసైటీ ఇచ్చునది. బైబిలుకాదు, పై వన్ని దూరమునుండి వచ్చువాటికి కాపుదల, శోధన దగ్గరకు వచ్చినప్పుడు కాపుదల ఖడ్గము, సైతాను క్రీస్తుని శోధించుటకు వచ్చినప్పుడు ఆయన వాక్యమనె ఖడ్గమును వాడెను.

## పాపక్షమాపణ పత్రము

వరుసలు

1. లేవి. 16:21 అరణ్యములోనికి మోసికొనుపోవును.
2. యెష. 38:17 వీపువెనుక పారవేసెను
3. మీకా. 7:19 సముద్రపు అగాధములలో పడవేసెను.
4. రోమా. 4:7 కప్పివేసెను
5. కొలస్స. 2:13-16 ఎత్తివేసెను
6. హెబ్రీ. 10:17 మరచిపోయెను.

కాగా ఎవడైను క్రీస్తునందున్న యెడల వాడు నూతనసృష్టి పాతవి గతించెను. ఇదిగో క్రొత్తవాయెను. 2కొరింథి. 5:17.

ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను. 2కొరింథి. 5:21.

తన స్వాస్థ్యములో శేషించిన వారి దోషమును పరిహరించి, వారు చేసిన అతిక్రమముల విషయమై వారిని క్షమించు దేవుడవైన నీతో సమముడైన దేవుడున్నాడా? మీకు (7:18).

నేను నీకు శిక్షవిధింపను (యోహా. 8:11) అని యేసు చెప్పెను. నేను నేనే నా చిత్తానుసారముగా నీ యతిక్రమములను తుడిచి వేయుచున్నాను. నేను నీ పాపములను జ్ఞాపకము చేసికొనను (యెష. 43:25). మంచు విడిపోవునట్లుగా నేను నీ యతిక్రమములను మబ్బు తొలగునట్లుగా నీ పాపములను తుడిచి వేసియున్నాను (యెష. 44:22). మన పాపములు, మన వ్యాధులు, మన శిక్షలు క్రీస్తు తనమీద వేసికొని, మనకు బదులు ఆయనే శిలువపై రక్తము చిందించి మరణించెను. ఈ పనియంతయు చేసిన ప్రభువైన యేసును స్మరించి నా సమస్త పాపములు సిలువమీదనే తీరినవని సంతోషించుము,

స్తుతించుము (యెష. 53:5). అతిక్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు. వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందును (సామె. 28:13) మీ పాపములు రక్తమువలె ఎఱ్ఱనివైనను అవి హిమమువలె తెల్లబడును; కెంపువలె ఎఱ్ఱనివైనను, గొఱ్ఱెబొచ్చువలె తెల్లనివగును (యెష. 1:18). ఆయన కుమారుడైన యేసురక్తము ప్రతిపాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును (1యోహా. 1:7). మన పాపములను మనము ఒప్పుకొనినయెడల ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి, సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును (1యోహా. 1:9). దేవుని కృపా మహదైశ్వర్యమునుబట్టి, ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది. (ఎఫెసీ. 1:7) మనలను ప్రేమించుచు తన రక్తమువలన మన పాపములనుండి మనలను విడిపించిన వానికి మహిమయు, ప్రభావమును, యుగయుగములు కలుగునుగాక, ఆమేన్. (ప్రక. 1:6). పితృ పారంపర్యమైన మీ వ్యర్థ ప్రవర్తనను విడిచిపెట్టునట్లుగా వెండి బంగారములవంటి క్షయవస్తువులచేత మీరు విమోచింపబడలేదు గాని, అమూల్యమైన రక్తముచేత అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్లవంటి క్రీస్తురక్తముచేత విమోచింపబడితిరని మీరెరుగుదురు (1పేతు. 1:18,19) నేను వారిదోషములను క్షమించి వారి పాపములను ఇకనెన్నడును జ్ఞాపకము చేసికొనను. మనస్సు క్రీస్తుని నమ్మ కలుగును, కీడు తొలగును, మేలు కలుగును, ఇట్టి నమ్మిక గలిగి కృతజ్ఞతానంద హృదయముతో పాపక్షమాపణ కర్తయగు తండ్రియైన దేవుని స్తుతించుము.

**స్తుతి ప్రార్థన:–** పరిశుద్ధుడవైన దేవా! నీకు స్తోత్రములు. నా పాపముల జాబితాలు చూపించిన నీకు వందనములు, నా పాపము నిమిత్తమై పశ్చాత్తాప హృదయమును కలిగించిన పరిశుద్ధుడా! నీకు వందనములు, నా పాపముల నొప్పింపజేసిన పరిశుద్ధాత్మ తండ్రి! ఘనత కలుగునుగాక! నా పాపమును మన్నించి నావనే నమ్మకమును నీ వాక్యమునుబట్టి నాలో పుట్టించిన దేవా! నీకు మహిమ కలుగునుగాక! నీవు కొరతవేయబడిన చిందించిన నీ రక్తమువల్లనే పాపహృదయమును కడిగి, పవిత్రపరచిన పరిశుద్ధుడా! నీకు ఘనత కలుగునుగాక! హిమముకంటెను, గొఱ్ఱె బొచ్చుకంటెను తెల్లగా ఉండునట్లు నీ రక్తప్రభావము వలన నా యావత్తు పాపమును పరిహరించినందుకు నిన్ను సుతించు చున్నాను. నీ యందలి మనోనిబ్బరమును నాకు కలిగించి, నా హృదయమును నీ పరిశుద్ధ రక్తమువలన శుద్ధిచేసి మనశ్శాంతి అనుగ్రహించి ఆత్మకానందము ప్రసాదించిన నీకు నిత్య మంగళ స్తోత్రగీతములర్పించుచున్నాను. ఇట్టి నీ గొప్ప ప్రేమను నేను గుర్తెరిగి, ఎప్పటికిని నిన్ను ఘనపరచునట్టి భాగ్యమును అట్టి హృదయ వాంఛయు నీ ఆత్మవలన నాకు ప్రసాదించుమని, శక్తియు మహిమయు గల క్రీస్తు యేసు నామమున పరమతండ్రి, నిన్ను వినయ పూర్వకముగా వేడుకొనుచున్నాను ఆమేన్. ప్రభువును స్తుతించండి. రక్షణ మహిమ ప్రభావములు మన దేవునికే చెల్లును ప్రక. 19:1.

**క్షమాపణ గైకొను ప్రార్థన:–** మీ నమ్మిక చొప్పున మీకు కలుగునుగాక! అని వ్రాయబడిన మాటనుబట్టి మాకు నీ వలన ఎంత శుద్ధి కలుగునని మేము నమ్మగలమో, అంత శుద్ధికలుగును

గనుక మేము నమ్ముటవలన అంతశుద్ధి పొందుదుమని క్షమాపణ అందుకొని క్రీస్తుప్రభువు నామమున తండ్రి నిన్ను కృతజ్ఞత హృదయముతో స్తుతించుచున్నాము. ఆమేన్.

**పరిశుద్ధ జీవితము కొరకు ప్రార్థన:–** నాలో నేరమున్నదని మీలో ఎవడు రుజువు పరచగలడు! అని చెప్పిన ఓ పరిశుద్ధుడా! నీకు మహిమ కలుగునుగాక! మేము కూడ అట్లు చెప్పగల పవిత్ర జీవనము దయచేయుము. నోవహు: నీతిమంతుడనియు, యోబు: యథార్థపరుడనియు, యోహాను: గొప్పవాడనియు, నీవు సాక్ష్యమిచ్చితివి మేముకూడ నీవల్ల ఇట్టి సాక్ష్యము పొందే జీవితమనుగ్రహించుము. నన్ను పోలి నడుచుకొనుడని, పౌలు చెప్పినట్లు మేమును చెప్పగల మాదిరి జీవితమును దయచేయుము. మా జీవితమనేది నిన్ను లోకమునకు చూపించే సాధనమై యుండునట్లు నీ దీవెన ప్రసాదించుమని యేసువారి పరిశుద్ధ నామమున తండ్రీ! నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఫరో తనమీదకు, తన ప్రజలమీదకు వచ్చిన శ్రమలను చూచి మారుమనసు పొందియు, శ్రమతీరిన వెనుక తన మనస్సును కఠినపరచుకొనెను. యూదా ఇస్కరియోతు తన తప్పును తెలిసికొని ఒప్పుకొనినను తాను ప్రభువును ఆశ్రయింపక నాశనమాయెను. మరియు పేతురు తన తప్పిదమును క్షమాపణ కర్తయగు, ప్రభు క్రీస్తు సముఖమందు ఒప్పుకొని, క్షమకలిగిన మారుమనస్సును పొందెను. ఫరో క్షణమాత్రపు మారుమనస్సు, యూదా క్షమాపణ పొందని మారుమనస్సును, పేతురు క్షమాపణ కలిగిన సరియైన మారుమనస్సును పొందెను. ఓ విశ్వాసీ! పై ఉదహరింపబడిన మూడింటిలో ఏ రకపు మారుమనస్సు నీవు కలిగియున్నావో పరీక్షించుము.

దైవచిత్తాను సారమైన దుఃఖము, రక్షణార్థమైన మారు మనస్సును కలుగజేయును 2కొరింథి. 7:10 మీరు దుఃఖపడి మారుమనస్సు పొందితిరని ఇప్పుడు సంతోషించుచున్నాను.

**తీర్మానము:-** నిర్దోషమార్గమున వివేకముతో ప్రవర్తించెదను; నా ఇంట యదార్థ హృదయముతో నడచుకొందును. నా కన్నుల ఎదుట నేను ఏ దుష్కార్యమును ఉంచుకొనను, భక్తిమార్గము తొలగినవారి క్రియలు నాకు అసహ్యములు, అవి నాకు అంటనియ్యను మూర్ఖచిత్తుడు నాయొద్దనుండి తొలగిపోవలెను. దౌష్ట్యమును నే ననుసరింపను. దా॥కీ॥ 101:2-4.

**ప్రార్థన:-** సకల పరిశుద్ధేచ్ఛలు. అన్ని మంచి ఆలోచనలు సర్వన్యాయ కార్యములు కలిగించెడు ఓ దేవా! ఈ దినము ఈ గడియనుండి నేను చెడుగుమాని మంచి చేయుటకును, నా కష్టనష్టములయందు సహితము నిన్ను దూషింపక, నా ప్రార్థనలు నెరవేరని సమయమందు నిన్ను అపార్థము చేసికొనక, నీ వాక్యము నేర్చుకొనుటయందును, నిన్ను ధ్యానించుటయందును, అశ్రద్ధగా నుండక, దశమభాగము కృతజ్ఞతార్పణలు చెల్లించుటయందు ముందంజవేయుచు, లేనిపోని కోరికలు కోరక, మనుష్యుల దయయందును, ఆశీర్వాదమునకు కర్తవైన నీ దయయందును, వర్ధిల్లునట్లు కృపచూపుము. మరియు ఎక్కువ కీడు నీకు కలుగకుండునట్లు ఇంకను పాపముచేయకుము అని చెప్పిన నీ వాక్కును మరువక, నా తీర్మానమంతటియందు నిలకడగానుండి నీకు కీర్తి కలిగించునట్లు, నా తీర్మానమంతటిని క్రీస్తు రక్తముతో ముద్రించుము తండ్రీ! నీ సన్నిధిలో స్థిరపరచుమని రక్షకుడైన క్రీస్తు నామమున వినయముతో వేడుకొనుచున్నాను. ఆమేన్.

**వ్రతము:-** నీ శాసనములు నాకు హృదయానందములు అవి నాకు నిత్యస్వాస్థ్యమని భావించుచున్నాను. నీ కట్టడలను గైకొనుటకు నా హృదయమును నేను లోపరచికొనియున్నాను ఇది తుది వరకు నిలుచు నిత్య నిర్ణయము. దా॥కీర్తన. 119:112.

**ప్రార్థన:-** నా భక్తికిని, ముక్తికిని ఆధారమైనయున్న ఓ దేవా! ఎన్ని శోధనలు నన్ను చుట్టుకొనునప్పటికిని, ఎట్టి కష్టములు నన్ను బాధించినను, ఎన్ని సందేహములు నా హృదయమును ఆవరించినను, ఎన్ని ఆటంకములు నన్ను అడ్డగించినను, ఎన్ని ఇబ్బందులు నన్ను ఇరికించినను, ఎన్ని నష్టములు వచ్చినను, నలిపివేసినను, ఎన్ని క్రీస్తు విరోధ బాధలు ఉన్నను నిన్ను విడువను ఇదే నా వ్రతము. నీ మహాశక్తిని బట్టి ఈ నా వ్రతమును నిలువబెట్టుదువని నమ్ముచు యేసు క్రీస్తు వారిద్వారా తండ్రీ, నిన్ను వేడుకొనుచున్నాను. ఆమేన్.

**సమర్పణ:-** (1) నా శరీరములోని ప్రతి అవయమును (2) నా ప్రాణాత్మలను (3) నా జీవమును, నిర్జీవమును, (4) నా జ్ఞానమును, అజ్ఞానమును (5) నా మనస్సాక్షిని తన పని సరిగా జరిగించిన స్థితిని జరిగించని స్థితిని (6) నా సద్గుణములు, దుర్గుణములు (7) నా ఊహకందని స్థితి (8) నా కోరికలు లేని మగతస్థితి (9) నా ప్రార్థనలు నెరవేర్పు కలిగిన భాగ్యము, వాటి నెరవేర్పు కలుగని అభాగ్యము (10) నా మనవులులేని స్థితి (11) నా ఉపకారములు, అపకారములు (12) నా సుఖములు, కష్టములు (13) నా మిత్రులు, శత్రువులు (14) భర్త, భార్య, బిడ్డలు అదిలేని స్థితి. తల్లి, తండ్రీ, అదిలేని స్థితి, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు అదిలేని స్థితి (15) నా బంధువులు స్వజనులు (16) నా సేవ అదిలేనిస్థితి

(17) ఉద్యోగము అదిలేనిస్థితి (18) నా నాగరికత (19) నా బలము, బలహీనత (20) నా ఆరోగ్యము, అనారోగ్యము (21) నా కలిమి, లేమి (22) నామాట, పాట, ఆట, నా నడక, పడక, కునుకు, వినికి, ఉనికి, సంచారము, నాగానము, పానము, దానము, ధ్యానము, నా గతకాలము, నా నవీనకాలము, భావికాలము. నా నైజము నాకు తెలిసియు తెలియక ఏమి విడిచితినో అవియు, ఇంకా మరచితినో అవియు నీకు సమర్పణ చేయుచున్నాను.

కీర్తన:- నా ఇష్టమిదిగో యిది - నీ ఇష్టముగచేయ - నా ఇష్టమిక కాదది - నా ఇచ్ఛయున్నట్టి - నా హృదయమిదిగో నీ - కే యియ్యదిరాజ - కీయ సింహాసనమౌ.

అవును తండ్రీ! ఈలాగుచేయుట నీ దృష్టికి అనుకూలమాయెను. మత్త. 11:26; రోమా. 12:1; 6:13; 2తిమో. 1:12; 1పేతు. 4:19.

**ప్రార్థన:-** ఓ తండ్రీ! నీవు నన్ను కలుగజేసినందున నీ ఇష్టప్రకారము చేయపూనుకొనుచున్నావను నా ఇష్టము నీ ఇష్టమునకు సరిపడియుంటే సరి, లేకపోయిన నా ఇష్టమును పూర్తిగా త్రోసివేసి నీ ఇష్టమును నెరవేర్చెదను. నీ ఇష్టము నాకు బయలుపరచబడినప్పుడు అది నాకు ఇష్టము లేకపోయినను సరే, కష్టముగా కనబడినను సరే, ఇష్టపరచుకొని చేసి తీరెదను. నేను పనిచేయు కాలమందు విశ్రాంతి కాలమందును, మెలుకువ సమయమందు, ప్రయాణపు వేళయందును భోజన సమయమందును, చదువుచున్న సమయమందును, విచార పరిస్థితులయందును, జబ్బుగా ఉన్నస్థితియందును, అన్ని స్థలములయందును, అన్నివేళల నీ తలంపుతోనే యుండుటకు అలవాటు చేసికొందును, అనుదినము నీ చిత్తము తెలిసికొనుటకై నీ

వాక్య గ్రంథమును పఠించుటకు సహాయము లేకపోయినను సమయము కల్పించుకొని, ఇష్టము కలిగించుకొని, కొద్దికొద్దిగా క్రమము ననుసరించి చదివి తీరెదను. అధమపక్షము దినమునకు ఒక్కసారియైనను నీ సన్నిధిలో నామనవులు గలిగిన ప్రార్ధనలు చేసితీరెదను. ఆ విధముగానే రోజునకు ఒక గంట నీ సన్నిధిలో మౌనముగా కనిపెట్టుకొనియుండెదను. నా కంటబడే క్రొత్తవానిని గూర్చి వానిని రక్షించుమని ఒక నిమిషము ప్రార్ధనచేయ ప్రయత్నించెదను. అజాగ్రత్త, అనాచారము, అపవిత్రత, అజ్ఞానము, అసంతృప్తి, అనాగరికత, అశుభ్రత ఈ మొదలైనవి లేకుండ చూచుకొనెదను. ఈ నా సమర్పణతో కూడిన ప్రార్ధన క్రీస్తు యేసు రక్తముతో ముద్రించుమని తండ్రి నిన్ను వేడుకొనుచున్నాను. ఆమేన్.

లుబెక్ అనే ఒక పట్టణములో ఒకరాయి దొరికెను. దానిమీద ప్రభువు చెప్పినమాటలు ఉన్నవి. ఏమనగా:- నేను బోధకుడనని చెప్పుచున్నారు. సంతోషమే కాని నేను చెప్పినట్లు చేయకపోతే నా తీర్పులు పంపినపుడు నన్నేమియు అనవద్దు సుమా!

ప్రార్థించిన తర్వాత దైవచిత్త ప్రకారము చేయనియెడల నీ సమర్పణకు విలువయుండదు. దిగువ కనుపరచిన అంశముల మీద గాని ఇంకా నీ ఇష్టమువచ్చిన ఏ చిన్న విషయమును గూర్చియైనను ప్రార్థింపవచ్చును.

**ప్రార్ధనాంశములు:-** (1) పాపమును గెల్చు బలము (2) భక్తి జీవితము (3) వరములు (4) ఆరోగ్యము (5) విద్య (6) ధనము (7) జ్ఞానము (8) అన్ని మతస్థులకొరకు (9) ఆస్పత్రుల నిమిత్తము (10) బీదల నిమిత్తము (11) ప్రయాణికుల కొరకు (12) గనులలో పనిచేయు వారికొరకు (13) సువార్తికుల

నిమిత్తము (14) పత్రికలు అచ్చువేసి పంచిపెట్టువారిని గూర్చి (15) బైబిలు సొసైటీని గురించి (16) కుటుంబములలో సమాధానములేని వారిని గురించి (17) అన్ని మిషనుల వారిని గురించి (18) పరిశుద్ధాత్మ బాప్తిస్మము (19) రక్షణ సువార్త అందరికి అందునట్లు (20) అధికారులను గూర్చి (21) పది ఆజ్ఞలకు విరోధమైన వారిని గూర్చి ఈ మొదలైన వాటిలో నీకు అవసరమైనదేదైన ఉదహరించి అది దయచేయుమని ప్రార్థింప వచ్చును. 1కొరింథి. 12:7-10; 2తిమో. 2:14.

**ప్రార్థనాలాపన:-** రోమా. 8:26 మీరు అడిగేవి అవసరమో కాదో ముందుగానే ఆలోచింపవలెను. మరియు ఒకానొకప్పుడు ఎంత ప్రయత్నించినను ప్రార్థనరాదు, అయినను ప్రయత్నము మానరాదు.

తన స్వకీయ కుమారుని అనుగ్రహించుటకు వెనుకతీయక మనందరికొరకు ఆయనను అప్పగించినవాడు, ఆయనతోపాటు సమస్తమును మనకెందుకు అనుగ్రహింపడు? రోమా. 8:32. కాగా నా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున, క్రీస్తుయేసునందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును. ఫిలిప్పీ. 4:19; దా.కీర్త. 132లో దావీదు ఇట్లు పట్టుదల కనబరచుచున్నాడు. ఒక స్థలము చూచేవరకు, నివాస స్థలము చూచేవరకు (1) వాసస్థానములో ప్రవేశింపను (2) పరుండను (3) నిద్రరానియ్యను (4) కునికిపాట్లు రానియ్యను. ప్రార్థన చేయగోరువారలారా! అది కావలెను. ఇది కావలెనని ఆశించే వారలారా! అదిపోలేదు, ఇది పోలేదని మూలిగే వారలారా! దేవుడు ఇంకా నా ప్రార్థన విన్నాడు కాదని, మొక్కేవారలారా! ఇంకెన్నాళ్ళు ప్రార్థించను అని చతికిలపడే వారలారా! ప్రార్థనను గూర్చిన

విషయములన్నీ తెలిసికొనకుండ ప్రార్థనారంభించే వారలారా! మీరెందుకు దావీదువలె పట్టుదల కలిగి దేవుని ప్రార్థింపరు. పట్టుగలిగి ప్రార్థింపవలెనని నీవు ప్రార్థనలో యుంటే పట్టుకుదురును. అప్పుడేమి చేయవలెను. ఆ పట్టునిమిత్తము ప్రార్థించవలెను. పట్టులేని యెడల నీవు కోరుకొనేది నీకు అక్కరలేదన్నమాటయే, నీకు పట్టులేకపోతే దొరకనప్పుడు దేవుడు నా ప్రార్థన వినలేదని ఎందుకందువు? మరియు లోకములో ఏ పని విషయములోనైన పట్టుదల లేకపోతే నెరవేరునా? నెరవేరదుగదా! గనుక మనోనిదానము కలిగి యుండుము. అప్పుడు పట్టుదల గలిగియుండుటకు మార్గమేర్పడును. ఏ సంగతిని గూర్చి ప్రార్థన చేయుదుమో ఆ సంగతినిగూర్చి ప్రార్థన సమయమంతటి యందును ఆలోచించవలయును. దానియందే దృష్టి కేంద్రీకరించవలయును.

**దేవుడు మన ప్రార్థనలు వినుటకు గల కారణములు:**

(1) ఆయన మన తండ్రి గనుక (2) ఆయన వాగ్దానములు వ్రాయబడియున్నందువలనను (3) తోటలోని చెట్టుపోతే తోట మాలికి నష్టము కాదా! ఆ విధముగానే లోకమనే తోటలో చెట్టువలె ఉన్న మన విషయములో తోటమాలివలె ఉన్న దేవునకు నష్టముకాదా! ఆ మనిషికి నష్టముకాదా! (4) పలానివారి ప్రార్థన వినలేదు మన ప్రార్థన మాత్రము వినునా అందరికి దిగులుకాదా! (5) దేవదూతలు కూడా మన పక్షముగా అడుగుదురు కనుక విసుగవద్దు, ఈ కారణములను ఎత్తి దేవునిని ప్రార్థించుము.

**బైబిలు వాక్యములు**

నీ కోరికను సిద్ధింపజేసి, నీ ఆలోచన యావత్తును సఫల పరచునుగాక! కీర్తన. 20:4. నా నామమున మీరు నన్నేమి

అడిగినను నేను చేతును యోహా. 14:14. అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును మత్త. 7:7. తన సొంత కుమారుని అనుగ్రహించుటకు వెనుకతీయక మన అందరికొరకు ఆయనను అప్పగించినవాడు ఆయనతోపాటు సమస్తమును మనకెందుకు అనుగ్రహింపడు! రోమా. 8:32. నాయందు మీరును మీయందు నా మాటలను నిలిచియుండిన యెడల మీకేది ఇష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును యోహా. 15:7. మీరు నా పేరట తండ్రిని ఏమి అడుగుదురో అది ఆయన మీకనుగ్రహించునట్లు మీరు వెళ్ళి ఫలించుటకును, మీ ఫలము నిలిచియుండుటకు నేను మిమ్మును ఏర్పరచుకొని నియమించితిని యోహాను 15:16. ఇది మనుష్యులకు అసాధ్యమే గాని, దేవునికి సమస్తమును సాధ్యము మత్త. 19:26.

నేను యెహోవాను, సర్వశరీరులకు దేవుడను, నాకు అసాధ్యమైన దేదైన నుండునా? యిర్మి. 32:27; ఆది. 18:14. దేనిని గూర్చియు చింతపడకుడి గాని ప్రతివిషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి ఫిలిప్పీ. 4:6. దేవుడు తాను ఏర్పరచుకొనిన వారు దివారాత్రులు తన్నుగూర్చి మొఱ్ఱపెట్టుచుండగా వారికి న్యాయము తీర్చడా? ఆయన వారికి త్వరగా న్యాయము తీర్చును లూకా. 18:7,8.

మనలో కార్యసాధకమైన తనశక్తి చొప్పున మనము అడుగు వాటన్నిటికంటెను, ఊహించు వాటన్నిటికంటెను అత్యధికముగా చేయశక్తిగల దేవునికి, క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు, సదాకాలము మహిమ కలుగునుగాక. ఆమేన్.

ఎఫెసీ. 3:21. భూమిమీద మీరు వేటిని బంధింతురో అవి పరలోకమందును బంధింపబడును, భూమిమీద మీరు వేటిని విప్పుదురో అవి పరలోకమందును విప్పబడునని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. మత్త. 18:18.

మనమేమి అడిగినను ఆయన మన మనవి ఆలకించునని మనమెరిగిన యెడల, మనమాయనను వేడుకొనినవి మనకు కలిగినవని యెరుగుదుము 1యోహా. 5:5.

దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడిన వారికి ఆ మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము. రోమా. 8:28. నీవు సమస్త క్రియలను చేయగలవనియు నీవు ఉద్దేశించినది ఏదియు నిష్ఫలము కానేరదనియు నేనిప్పుడు తెలిసికొంటిని (యోబు. 42:2). మీ నమ్మిక చొప్పున మీకు కలుగునుగాక. మత్త. 9:29. నీవు విశ్వసించిన ప్రకారము నీకు అవునుగాక. మత్త. 8:13. సమస్తమును మీవి. 1కొరింథి. 3:21. అయితే అతడు ఏ మాత్రమును సందేహింపక విశ్వాసముతో అడుగవలెను. సందేహించువాడు గాలిచేత రేపబడి ఎగిరిపడు సముద్ర తరంగమును పోలియుండును. అట్టి మనుష్యుడు ద్విమనుష్యుడై తన సమస్త మార్గములయందు అస్థిరుడు గనుక ప్రభువు వలన తనకేమైనను దొరుకునని తలంచుకొనరాదు. యాకోబు 1:6,8.

అందుచేత ప్రార్థన చేయునప్పుడు మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నామని నమ్ముడి. అప్పుడు అవి మీకు కలుగునని మీతో చెప్పుచున్నాను. మార్కు. 11:24. మనలో విశ్వాసమును బట్టి క్రీస్తుప్రభువు నెరవేర్చును గాని మనము కాదు

నెరవేర్చువారము. అబ్రాహాము నిరీక్షణకు ఆధారము లేకపోయినను నిరీక్షణ కలిగి నమ్మెను. రోమా. 4:18.

దేవుడు లోకమునకు ధర్మముచేసిన బైబిలు గ్రంథములోని వాగ్దానములు చూడుము. శ్రమలనుకాదు. సృష్టికర్త నీకిచ్చిన దానములను అనగా భూమ్యాకాశములను వాటిలోని సృష్టమును చూడుము, శ్రమలనుకాదు. గతకాలము విశ్వాసుల ప్రార్ధనలు నెరవేర్పులను చూడుము, శ్రమలనుకాదు. క్రీస్తుప్రభువు అవతార కాలమున విషయమై చేసిన సర్వకార్యములను చూడుము శ్రమలను కాదు, నీ ప్రార్ధన నెరవేర్పులను చూడుము. శ్రమలనుకాదు. ఒక యూరపియనుడు అధికమైన వడగండ్ల వర్షము కురియుచు మనుష్యులకు హానిచేయుచుండుట చూచి తండ్రీ! ఆపుచేయుము, అని ప్రార్థించెను. వెంటనే వర్షము ఆగెను. ఎంత గొప్ప నమ్మిక.

*విశ్వాసమనగా నేమి?*

1. వాక్యములో ఉన్నది. అర్ధమైనను కాకపోయినను నమ్ముట .2. నమ్ముటకు లేనప్పుడు అబ్రాహామువలె నమ్ముట. 3. ఎవరాక్షేపించినను తుదివరకు నమ్ముట. 4. లక్షప్రశ్నలు మనస్సులో ఉన్నను నమ్ముట. 5. నెరవేరకపోయినను నమ్ముచునే యుండుట. 6. అడిగినదే అడగడము కాదుగాని దొరికినదని ఆనందించుటయే నమ్మికయైయున్నది.

తెలిసికొనవలసిన ప్రశ్నలు ఉన్నను, సందేహించే ప్రశ్నలు ఉండకూడదు. విశ్వాసముయొక్క చట్టమును బట్టిచూస్తే ఏ ప్రశ్నలును ఉండకూడదు.

ఇట్టి విశ్వాస హృదయముతో దేవుని స్తుతించుట వలన సంతోషించుము. అందువలన ముఖము ఎల్లప్పుడు కళగా ఉండును.

సంగతి జరగకుండుటచూచి ఇదియే సమయమని ఎంచి బైబిలులోని విశ్వాసులైనవారు ఏ రీతిని నమ్మిరో అది జ్ఞాపకము తెచ్చుకొనుచు నవీనకాల భక్తులు ఎట్లు అద్భుతకరమైన విశ్వాసము కలిగియున్నారో అది యావత్తు జ్ఞప్తికి తెచ్చుకొనుటవల్ల, తిరిగి నెమరువేయుచు విశ్వాసమును పెంచుకొనుచు, మరింత బలపడుటయు, స్థిరవిశ్వాసము కలిగి కార్యసిద్ధి పొందు భాగ్యమును కన్నులార చూడగలరు.

**ప్రార్థన నెరవేర్పు కలుగకుండుటకు గల కారణములు:-**

1. ఏదో ఒక పాపము నీలో దాగియుండుట వలనను 2. అవిశ్వాసము లేక అపనమ్మిక కలిగియుండుటవలనను 3. దేవుడు క్షమించిన నీ పాపములను తలంచుకొనుట వలనను. 4. నీ అయోగ్యత స్థితిని తలంచుకొనుచు కృంగిపోవుట వలనను 5. ప్రార్థనకు కొన్ని పర్యాయములు జవాబు ఆలస్యమగును. ఎందుకనగా మనముచేయు ప్రార్థనలు రెండవ ఆకాశము దాటి, మూడవ ఆకాశములోని దేవుని సింహాసనము చేరవలెను. అలాగే దేవుడు ఇచ్చు జవాబుకూడా మన దగ్గరకు రాకముందే సాతాను సమూహమందు రెండవ ఆకాశము ద్వారా రావలయును. ఇక్కడ నుండి ప్రపంచములోని విషయములు సాతాను, వాని సంబంధికులు తమ స్వాధీనమందుంచుకొని నడిపించుదురు. దానియేలు ప్రార్థనకు జవాబు రాకుండ గబ్రియేలను మూడు వారములు ఆపగలిగెను. ఆకాశములో యుద్ధము జరిగెను. ఎఫెసీ. 2:2; 6:12. బహుపరాక్రమము గలిగిన పారసీక రాజ్యాధిపతి చేతిలోనుండి గబ్రియేలు దూతను విడిపించుటకై ప్రధాన దూతయైన మిఖాయేలు రావలసియుండెను. దాని. 10:13. అలాగైతే చెడు మార్గములను వదలి విశ్వాస ప్రార్థనలతో మనము కనిపెట్టుదుము గాక!

ముగింపు:- ప్రతి ప్రార్ధనయొక్క చివర వాడవలసిన మాటలు.

1. త్వరలో వచ్చుచున్న యేసుప్రభువుద్వారా 2. త్వరలో వచ్చి విశ్వాసుల సంఘమనే పెండ్లికుమార్తెను కొంచుకొనిపోవనైయున్న యేసుద్వారా, 3. పూర్వము ఈ భూమిమీదికి వధకు తేబడిన గొర్రెపిల్లవలె వచ్చి, ఇప్పుడు పెండ్లి కుమారుడుగా వచ్చుచున్న యేసుద్వారా, 4. పూర్వము భూరాజుల చేతిక్రింద ఉండి ఇప్పుడు యువరాజుగా వచ్చుచున్న యేసుద్వారా, 5. పూర్వము ఒక బీదవానివలె ఈ మట్టిమీద సంచరించి, ఇప్పుడు మహామహిమతో వచ్చుచున్న ప్రభుయేసుద్వారా, 6. పూర్వము గార్ధభాసీనుడై భూలోక ప్రధాన పట్టణమునకు వెళ్ళి నేడు మేఘాసీనుడై వచ్చుచున్న యేసుద్వారా 7. పూర్వము బహిరంగ యూదుల నిమిత్తమై వచ్చి ఇప్పుడు క్రైస్తవులకొరకు, అన్యులకొరకు, అందరికొరకు వచ్చుచున్న యేసుద్వారా, 8. మృతులైన విశ్వాసులను బ్రతికించుటకు, బ్రతికియున్న విశ్వాసులను రూపాంతర ధారులనుగా చేయుటకు వచ్చుచున్న క్రీస్తుద్వారా,

షరా:- పై మాటలలో మీ ఇష్టము వచ్చిన మాటలను వాడుకోవచ్చును.

**_స్తుతి ప్రార్ధనలో ఉపయోగించుకొనవలసిన మాటలు:_**

స్తోత్రం అనగా స్తుతి, వందనము, నమస్కారము, పూజ, ఆరాధన, గౌరవము, ఘనత, కీర్తి, కృతజ్ఞతాస్తుతి, మహిమ ప్రభావము, ఆర్భాటము జయము ప్రక. 4:9-11; 7:12.

ఆమేన్ అనగా అలా జరుగును గాక! అని అర్ధము. ప్రక. 1:6-11; 2పేతురు. 3:18.

ప్రార్ధన:- దేవా! పరిశుద్ధగ్రంథములో వ్రాయించిన వాక్యములో ఉన్నట్లు నాకు విశ్వాసము కలిగించుము. నీవు

చేసెదవని నమ్ముచున్నాను. దేవా! నీవు నా మనవి ఆలకించి వేసినావని ధృఢముగా నమ్ముచున్నాను. ఆమేన్.

**స్తుతి ప్రార్థన:–** నిత్యుడవైన దేవా! నీకు స్తోత్రము. సత్య దేవుడవైన నిన్ను స్తుతించుచున్నాను. నీవు నీ గ్రంథములో వ్రాయించిన వాగ్దానములను స్మరణకు తెచ్చుకొన్న నిన్ను ఘనపరచుచున్నాను. నీ వాగ్దానములను నెరవేర్పు చూపుటకు శక్తిమంతుడవైన దేవా! నీకు స్తోత్రములు. ఇచ్చుప్రేమ నీలో ఉన్నందున నీకు వందనములు. శక్తియు ప్రేమయున్నందుననే నీవు వ్రాయించిన నీ వాక్యగ్రంథమును నా చేతిలో పెట్టినావు నీకు స్తోత్రములు. అట్టి వాగ్దానములు నా నేత్రములకు చూపించినావు గనుక నీకు ఘనత కలుగును గాక! అట్టి వాగ్దానములు నా చెవులకు వినిపించినావు గనుక నీకు కీర్తి కలుగును గాక! అట్టి వాగ్దానముల నెరవేర్పు చూపించు నిమిత్తమై నీ సన్నిధిలోనికి నన్ను నడిపించినావు. దేవా! నీకు నిత్యమంగళ కృతజ్ఞతార్పణలు యేసుక్రీస్తుద్వారా చెల్లించుచున్నాను. ఆమేన్.

షరా:– బైబిలులోని స్తుతులు, నీ స్వంతమాటలు, పాటలు ఉపయోగించుకొనవచ్చును. స్తుతిమాటలే పాటలుగా కూడా పాడుకొనవచ్చును.

జన్మదినము మొదలు నేటివరకు శరీర సంబంధమైన మేళ్ళను గూర్తి స్తుతులు.

1. ఓ మహిమా స్వరూపివైన దేవా! నేను పుట్టకముందే అనగా తల్లిగర్భమందు నిరూపింపబడక ముందే, మా నిర్మాణ విషయములన్నియు నీ పుస్తకములో వ్రాసిపెట్టినావు. దీనినిబట్టి చూచి మా మీద నీకుగల ప్రేమ, జ్ఞాపకము, శ్రద్ధ అను వాటిని బట్టి నిన్ను స్తుతించుచున్నాను.

2. మేము జన్మించిన పిమ్మట మేము జీవము కలిగి యున్నప్పటికిని మమ్మును మేము కాపాడుకొనలేమని నీవు ఎరిగిన వాడవై ఆ పని మా తల్లిదండ్రులకు అప్పగించినావు. గనుక నీకు స్తోత్రములు. నీ కృపలో ఒక భాగమైయున్న నీ కాపుదలను స్మరించుచు నీకు వందనములు అర్పించుచున్నాము.

3. ఓ దేవా! మమ్మును పోషింపవలసినదని మేము నిన్ను అడుగలేదు. అయినను మమ్మును పాలు వలనను, ఆహారము వలనను పోషించుచున్నావు. నీ పోషణను నీ ప్రేమను తలంచుకొని నిన్ను ఘనపరచుచున్నాము.

4. ఓ దేవా! మాకు అనుదిన ఆహారముగాక పైగా తిను బండారములను దయచేయవలసినదని నేను నిన్ను అడుగకపోయినను అవికూడా దయచేయుచున్నావు గనుక కీర్తి కలుగునుగాక.

5. సమస్త వస్తువులు నా ఉపయోగ నిమిత్తమై కలుగజేసి ఇచ్చిన నీ కృపనిమిత్తమై నీ ధర్మ ఉపయోగనిమిత్తమై నీకు ప్రభావము కలుగును గాక!

6. ఓ దేవా! వస్త్రములు దయచేయుమని మేము నిన్ను అడుగకపోయినను అవికూడ దయచేసిన నీకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాము. కష్టపడి సంపాదించిన వాటినికూడా అనుగ్రహించుచున్నావు. ఈ నీ సంపాదన ప్రేమ నిమిత్తమై నిన్ను ఘనపరచుచున్నాము.

7. ఓ దేవా! మమ్మును బడికి పంపించి అందుకు అవసరమైన వస్తువులు పుస్తకములు ఇప్పించి విద్య నేర్పించిన ఉపాధ్యాయ ప్రేమనిమిత్తమై నీకు చాలా వందనములు చెల్లించుచున్నాము.

8. నాకు చదువుచెప్పు ఉపాధ్యాయులను, విద్యలోను, ఆటలలోను, సహకారులుగా ఉండవలసిన తోటిపిల్లలను

అనుగ్రహించినావు. గనుక నీకు స్తోత్రములు. నీ సహాయ ప్రేమ నిమిత్తమై నీకు అనేక నమస్కారములు.

9. ఓ దేవా! మేము చదువు ముగించిన తరువాత ఏదో ఒక పనిలో ప్రవేశపెట్టినందుకు నీకు ప్రభావములు కలుగును గాక, మా పనిలో నీ తోడు సహాయము అనుగ్రహించుచున్న ప్రేమ స్తుతి కలుగునుగాక.

10. మా దేశమును న్యాయముగా చక్కగాను పరిపాలించే అధికారులను అనుగ్రహించినావు. వారు మమ్మును కాపాడే విషయములోను సహాయముచేసే విషయములోను పూచీదారులై యుండునట్లు చేసినావు. గనుక స్తోత్రములు, మరియు ఆ అధికారము నీవలననే కలిగినది. అందువలన నీవు అందరికి పై అధికారివై యున్నావు గనుక నీకు కృతజ్ఞతార్పణలు చెల్లించుచున్నాము.

11. దేశములో మాత్రమేగాక ఇంటిలోకూడా అధికారులను బోలిన తల్లిదండ్రులను మాకంటె పెద్దవారైన సోదర సోదరీలను మా మేలుకోరిన వారినిగా ఏర్పాటుచేసిన నీకు వేలాది నమస్కారములు.

12. ఓ దేవా! మా సంతోషాభివృద్ధి నిమిత్తమై స్నేహితులను బంధువులను అనుగ్రహించియున్నావు స్తోత్రములు. వీరికంటె గొప్ప స్నేహితుడవు బంధువుడనైయున్నావు, అందుకు నిన్ను పూజించుచున్నాము. మనుష్యులద్వారా నీవు మాకు చేయుచున్న సమస్త ఉపకారముల నిమిత్తమై నీకు స్తోత్రములు.

13. మత భక్తి నిమిత్తము మమ్మును కాపాడుటకు ఇవాంజలిస్టులను, పాదరీలను, మిషనెరీలను అనుగ్రహించిన నీకు ఘనత కలుగునుగాక! అందరికంటె నీవు గొప్ప గురువైయున్నావు.

గనుక నీకు పూజార్పణలు యేసునామమున అర్పించుచున్నాము. ఆమేన్. నెహెమ్యా. 9:4-6.

స్తుతిప్రార్థన:- ఓ దేవా! నీవు ప్రేమవైయున్నావు. కనుక నేనెంత పాపినైనను నన్ను ప్రేమించుచున్న నీకు స్తోత్రములు.

ఓ దేవా! నీవు శక్తిమంతుడవై యున్నందున నాకు అన్నిటిలో సహాయము చేయగలవు అందుచేత నీకు వందనములు చెల్లించుచున్నాను.

ఓ దేవా! నీవు పరిశుద్ధుడవై యున్నందువలన సృష్టిని, మానవుని పరిశుద్ధముగా కలుగజేసియున్నావు. మానవుడు పాపము చేయుటద్వారా పరిశుద్ధతను కోల్పోయినను తిరిగి పరిశుద్ధులనుగా చేయుట నీవే ఈ లోకమునకు బలియైతివి ఇందుకు నీకు స్తోత్రములు.

జీవమైయున్న ఓ దేవా! మట్టిఘటమైన మానవునిలోనికి నీ జీవాత్మనుపంపి జీవింపచేయు చున్నందుకు స్తోత్రము. ఓ దేవా! నీవు సర్వవ్యాపివి గనుక నేను ఎక్కడవుంటే నీవు అక్కడుందువు గనుక ఓ దేవా! నీవు ఆది అంతములేని దేవుడవు గనుక నాతో ఎల్లప్పుడు ఉందువు కనుక నీకు మహిమ కలుగునుగాక.

కనిపెట్టుట: (దావీదు కీర్తన. 37:7) యెహోవా యెదుట మౌనముగానుండి ఆయనకొరకు కనిపెట్టుకొనుము.

ఇంతసేపు మాట్లాడిన నీవు నీ ప్రార్థనలన్నియు కనిపెట్టి పట్టుమీదకు ప్రవేశించిన నీవు మౌనముగా నుండుము. ఈ కనిపెట్టు పనిని ఎప్పుడుబడితే అప్పుడు నీవు నీ గదిలోనికి వెళ్ళి చేయవచ్చును గాని మరిముఖ్యముగా తెల్లవారకమునుపే లేచి కాళ్ళు, చేతులు మొదలైనవి శుద్ధీకరించుకొని దినమునకు అధమ

పక్షము ఒక గంటయైనను చేసిచూడుము. ఇష్టము లేకపోయినను కష్టముగా ఉన్నను బద్ధకముగా ఉన్నను తప్పనిసరిగా బలవంతముగానైనను లేని మనుస్సు కుదుర్చుకొని చేసిచూడుము, అప్పుడు నీవు గొప్ప అనుభవమును పొందగలవు.

సహోదరులారా! మన ప్రభువైన యేసుక్రీస్తు కృప మీ ఆత్మతో ఉండునుగాక! ఆమేన్. (గలతీ. 6:18; రోమా. 16:25-27; 2కొరింథి. 13:14).

**ఇతరులనుగూర్చిన ప్రార్థన:-** సర్వజనులకు తండ్రివైన దేవా! నీ సృష్టికార్యముల నిమిత్తమై నీకనేక స్తోత్రములు, మానవులందరును నిన్ను ఆరాధింపవలెనను ఉద్దేశ్యముతో అందరు అన్ని మతములను స్థాపించుకొన్నారు. గాని ఒకరికొకరికి మా మతము దైవ మతమని చెప్పుకొను గుణమున్నది. కొన్ని విషయములలో భేదములున్నను అన్ని మతములు ఒకటే అని కొందరనుచున్నారు. అట్లనరాదని కొందరనుచున్నారు. తండ్రి నీవు అందరికిని సత్యమును బైలుపరచమని యేసునామమున వేడుకొనుచున్నాను. ఆమేన్.

ఓ దేవా! తండ్రి నీ మహిమను అనుభవించుటకై నన్ను కలుగజేసిన నీకు అనేక స్తోత్రములు. నీ అనుగ్రహ దానములగు భూమి యాకాశముల నిమిత్తమై నీకనేక వందనములు. నీ విషయము పూర్తిగా తెలిసికొనగల బైబిలు గ్రంథమును దయచేసినందులకు నీకనేక స్తుతులు. అది గ్రహించుటకు నీ ఆత్మ సహాయమునిమ్ము. నన్ను అనుదినము పవిత్రపరచు చుండుము. నీ చిత్తానుసారముగా నన్ను నడిపించుము. నాకు ఏమి ఇవ్వవలెనని నీకున్నదో అదే ఇమ్ము. నాతో ఏమి

చేయింపవలెనని ఉన్నదో అది చేయించుము. తుదకు నన్ను నీయొద్దకు తీసికొనివెళ్ళుము. నీవే అన్ని విషయములలో నాకాధారమైయున్నావు, నీకే మహిమ కలుగునుగాక! క్రీస్తు యేసు నామున అంగీకరించుము. ఆమేన్.

**రాకడ ప్రార్థన:-** ఓ ప్రభువా! దివ్యరక్షకా! త్వరగా వచ్చుచున్న లోక నామధారివైన ఓ క్రీస్తుయేసు ప్రభువా! నీకు స్తోత్రములు. నీవు త్వరగా వచ్చుచుండగా మేము మెల్లగా మూలను మెదలకుండా ఉన్నాము, మా తలంపంతా రెండవ రాకడతో నింపుము. ఎల్లప్పుడు చింతయే, ఎల్లప్పుడు విచారమె, మా బలహీనతలకు నీ సన్నిధియే విరుగుడని గ్రహించి, నీ సన్నిధిలో మా సమయమును గడుపుచు వాటికి సెలవిచ్చెడి భాగ్యము పొంద గలుగునట్టి కృపను చూపుమని వేడుకొనుచున్నాము. నీ సన్నిధిలో ఉండుట వలననే నీ రాకడకు సిద్ధపడ కలుగునట్టి భాగ్యము పొందగలమని నమ్ముచున్నాను. అట్టి భాగ్యవే నాకు ప్రసాదింపుమని మా పరమతండ్రీ! ఈ ప్రార్థన మమ్మును నూతన యెరూషలేమునకు మహిమ మేఘుమువిూద తీసుకొని వెళ్ళుటకై వచ్చుచున్న యేసుక్రీస్తువారిద్వారా అంగీకరించుమని నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

**పరిశుద్ధాత్మ బాప్తిస్మము:-** యోవే. 2:28,29; యోహా. 1:33; అపో.కార్య. 2అధ్యాయము అంతా.

**రోగులకు:-** నిర్గమ. 15:26; కీర్తన. 10:3; 107:20; యాకో. 5:14-16.

**దయ్యములకు:-** 1సమూ. 16:14-23; మార్కు. 1:5-20; మార్కు. 16:20; అపో.కార్య. 16:16,18; యాకో. 4:7; 1యోహా. 3:8; ప్రక. 4:5 అంతా.

**జ్ఞానము కావలసినప్పుడు:-** యాకో. 1:5; 1రాజు. 3:9-12; సామె. 2:6.

**బీదలకు:-** మత్త. 6:31.

**ఆపదలో నున్నవారికి:-** కీర్తన. 3:4-19; 50:15.

శోధన కాలమందు ఇది శోధనకాలమని గ్రహించి పడేకాలము గదా! అని తెలిసికొని స్థిరముగా నిలువబడవలెను.

1. మీరు గొర్రెలవలె చెదిరిపోదురు అని ప్రభువు తన శిష్యులతో ముందే చెప్పెను. ప్రభువు పట్టబడినప్పుడు ఇది నిజముగా నెరవేరినది. ప్రభువు మాట జ్ఞాపకము తెచ్చుకొని, వారు బలము నిమిత్తమై ప్రార్థించి చెదరకుండ నుండవలసినది. ప్రభువు ముందెందుకు తెలియజేసెను? జాగ్రత్తగా నుండుటకే గదా! మనకు కష్టములు తెలిసినప్పుడు మనము వెంటనే మోకరించి బలహీనతలు ఒప్పుకొని నివారణ ప్రార్థనచేసి, స్తుతించి కష్టమును తొలగింపజేసి కొనవలెను.

2. పేతురు తప్పిపోవునని ప్రభువు ముందే తెలియజేసెను. అప్పుడు పేతురు ఏమిచేయవలసియుండును. ప్రార్థన చేయవలసినదే మరియు కోర్టు గుమ్మమువద్ద ప్రభువుయొక్క మాట జ్ఞాపకము చేసికొంటే ఎంత బాగుండును. ఒక భక్తుడిట్లు చెప్పెను- మొదటిమారు కోడికూసేటప్పుడు కూత పేతురుకు వినబడకుండా దయ్యాలు డప్పులు వాయించినవి, ఎంత పరధ్యానము. ఇవన్నియు మనబోధ నిమిత్తమై వ్రాయబడియున్నవి. పూర్వీకులకంటే మనము ఎంత జాగ్రత్తగా నుండవలెను. మీరు శోధనలో పడకుండునట్లు మెళుకువబడి జాగ్రత్తగా నుండండి.

3. ఇంగ్లాడులో నొక మహాగొప్ప దైవభక్తుడు తన ప్రసంగమువల్ల అనేకులైన పాపులను ప్రభువుతట్టు త్రిప్పెను గాని

తుదకు ఏదో ఒక విషయములో నిరాశపడి బాత్రూములోనికి వెళ్ళి తలుపు వేసికొని స్వహత్య చేసికొనెను అనే కథ విని నీవు జాగ్రత్తపడుము. "ఓ భక్తగ్రేసరా, మెళుకువగా నుండుము, నీవు మరుపు కలిగియుంటే అజాగ్రత్తగా నుంటే, సోమరిపోతువైయుంటే, నిద్రపోతువైయుంటే పిశాచి నీమీద పడదా!

4. క్రీస్తుప్రభువు పరిశుద్ధాత్మను పొందిన తర్వాత వెంటనే సైతాను, శోధన ఆరంభమాయెను. గొప్పస్థితిలోనికి వెళ్ళిన తర్వాత శోధించుట అవసరమైయున్నది. ఎందుకంటే నీ గొప్పతనము ఒంటరిగా నుంటేనే గొప్పతనము. శోధన వచ్చేటప్పుడు ఉండేదో, ఊడేదో తెలియును.

ఉదా: క్షయరోగులకు జ్వరము పూర్తిగా పోగానే నడచుటకు సెలవిచ్చెదరు. రెండురోజులు నడచిన తర్వాత జ్వరము వచ్చిన యెడల ఆరోగ్యము స్థిరమైనదికాదని గ్రహించుకొనవలెను.

5. సూదంటురాయికి సమీపములో సూదిగాని, ఇనుప ముక్కగాని ఉన్న యెడల లాగబడును. ఎందుకంటే దానిలో ఇనుమును ఆకర్షించే నైజమున్నది. మన హృదయములో నున్న చెడునైజము పిశాచియొక్క శోధనకు త్వరగా లోబడిపోవును. అందుచేతనే మనము క్రీస్తునందు నూతన సృష్టియైయుండవలయును.

ప్రపంచమంతటన్ గ్రమ్మిపిశాచులేమి చేయున్<br>
మమ్మెల్ల మ్రింగనున్నను మాకేల భీతివేయు<br>
ఈలోకాధిపుడుగ్రుడైనన్ తానేమిచేయు ఇట్లు లూథరు పాడెను. ఇట్లు శోధనకాలమందు ప్రతి విశ్వాసి పాడవలెను.

6. యోసేపు శోధనయొద్దకు వచ్చినప్పుడు తాను ఆ శోధన యొద్దకు రాలేదు. కాని ఆ శోధనయొద్దనుండి పారిపోయెను.

ఇట్లే అందరు చేయవలెను. దావీదువలె గొప్ప ఆత్మీయులైన అనుభవము లేకపోయినప్పటికి చిన్నప్పుడు నేర్చుకొన్న సంగతులను బట్టి యోసేపు బలముగలవాడై శోధనను జయించెను. యుద్ధములో ఒక దేశమును జయించిన రాజుకంటె యోసేపువంటివాడే గొప్ప జయశాలి, విశ్వాసీ! నీ నైజమును జయించుము. అప్పుడు నీవు యోసేపువలె సింహాసనాసీనుడవైయుందువు.

7.యోసేపు పారిపోయెను గాని క్రీస్తుప్రభువు శోధన స్థలములకు ఒంటరిగా వెళ్ళెను, జయించెను. ఇది మరి విచిత్రమైన కార్యము. ప్రభువు విషయములో ఒకటి జ్ఞాపకముంచుకొనవలెను. ఆయన శోధన స్థలమునకు దైవాత్మవలన నడిపింపబడెను. ఆయన నైజములో సూదంటిరాయి ఎదుటనున్న వస్తువుయొక్క స్వభావము వంటి స్వభావములేదు గనుక జయించెను. ముందు మన నైజమును మార్చుకొనవలెను. అలాగే మనలను ఆత్మ నడిపించుకొని వెళ్ళితే వెళ్ళవచ్చును. ఒక నిచ్చెనకలదు. దానికి ఏడుమెట్లు, చివరి మెట్టుకు వెళ్ళిపడితే. దెబ్బతగలదా? ఎక్కువ స్థితిలోనికి వెళ్ళువారు పడకుండ జాగ్రత్తపడవలెను.

**శోధనలు:–** 1. పాపములో పడవేసె శోధనలు, 2. నిందల శోధనలు, 3. వ్యాధి శోధనలు, 4. భీతి శోధనలు, 5. చింత శోధనలు ఈ మొదలగు శోధనలు వచ్చేటప్పుడు వాటినన్నిటిని జయించుటకు స్థిరముగా నిలువబడవలెను, గాని వాటిని చూచి బెదరకూడదు, ఇవి వచ్చునని ముందుగానే మనకు తెలియునుగదా! పరలోకము నుండి ఒక దరినుండి శక్తినిపొందుచు, ఒక దరినుండి శోధనలు జయించుచుండవలెను.

8) దావీదు దైవజనుడై యుండెను. అయినను ఆయన శోధన కాలమందు పాపముయొక్క సంగతి మరచిపోయి

యుండెను. నాతాను ప్రవక్తవచ్చి ఉపమానములుగా దావీదునకు పాపము జ్ఞాపకము చేసినప్పుడు అది జ్ఞాపకము వచ్చెను. అలాగుననే శోధనయందును కొందరు గొప్ప పాపములను గురించి కూడ తలంపక ఏమియు లేనట్లుగా యుందురు. విశ్వాసీ! జాగ్రత్తగ నుండుము. మంచి మనస్సాక్షి కలిగియుండుము. అనగా తప్పుఏదో నీకు తేటగా చెప్పగలిగే మనస్సాక్షిని కలిగియుండుము. పాపమువల్ల మనస్సాక్షి కప్పబడియుండును, అప్పుడు మంచిచెడ్డలు చెప్పుటకు దానికి శక్తియుండదు.

9. సొలోమోను దేవుని ధర్మశాస్త్రము తెలిసినవాడైనను అన్యస్త్రీలను వివాహ మాడెను. స్త్రీలయొక్క ప్రేరేపణచేత విగ్రహారాధన పాపములోపడెను. కాబట్టి ఇతరులయొక్క ప్రేరేపణలకు మనము ఒప్పుకొనకూడదు. ఎంతటివారైనను అనగా దావీదు, సొలోమోనులవంటి సజ్జనులైనను పడిపోవుటకలదని జాగ్రత్తపడవలెను, ఈ దిగువ వాక్యములను బాగుగా చదువుకొనుము. 1కొరింథి. 16:13; 1తిమో. 2:15; 3:13, 1కొరింథి. 11:14; 1పేతురు 6:9; 1యోహా. 5:4; ఎఫెసీ. 6:1; కీర్తన. 46:12-52; యాకో. 1:5; 2:12.

10. షద్రకు, మేషకు, అబెద్నెగోలు ఏమి చెప్పియున్నారు, రెండు సంగతులు చెప్పియున్నారు. 1. మా దేవుడు అగ్నిగుండము నుండి తప్పించుటకు సమర్థుడైయున్నాడు. 2. రక్షింపకపోయినను మేము విగ్రహారాధన చేయము, చూచినారా వారియొక్క స్థిర విశ్వాసము అగ్ని గుండమువంటి శ్రమ వచ్చినను విశ్వాసము కదలకూడదు. శరీరము భస్మమైపోవచ్చును. విశ్వాసము అగ్ని తగిలి పడిపోదు.

11. బెల్జియం దేశములో గొప్ప యుద్ధకాలమందు ఒక భక్తిగల స్త్రీ గాయపడినవారికి సహాయము చేయుచుండెను. ఆమెను

తుపాకీతో కాల్చివేయుటకు శత్రువులు నిశ్చయించిరి. ప్రభువు భోజనము పుచ్చుకొనేవరకు ఉండుమని చెప్పెను. తరువాత ఆమె ధైర్యముగా వారి ఎదుట నిలువబడెను. వారామెను కాల్చివేసిరి. ఆమె భయపడలేదు. ప్రభువునందు ఆమెకుగల విశ్వాసము ఎంత గొప్పది. అట్టి శ్రమలు మనకు లేకపోయిన ధైర్యములేదు, విశ్వాసము లేదు శ్రమలమధ్య విశ్వాసము స్థిరత కలిగియుండుము.

12. ఒక మిషనరీ శరాయి గుండా పాముదూరగా ఆయన మనసు చలింపలేదు. వెంటనే కాగితములబుట్ట దగ్గరపెట్టి ఆడించెను. అప్పుడు అది బైటకువచ్చి పడెను. ఆపత్కాలమందు మనోస్థిరత కలిగియుండుట ఎంత ఆశ్చర్యము. హాని కలుగజేసే పామువంటి ఆపదమీద పడినప్పుడు ఓ విశ్వాసీ! నీ విశ్వాసము చంచలములేనిదై యుండగలదా?

13. రంగూన్ ట్రెయిన్ బద్దిమీద పిల్లనక్క ట్రెయిన్ దగ్గరకు వచ్చేవరకుండి చప్పున తప్పించుకొనెను. ఓ విశ్వాసీ! తీరా, ఆపద దగ్గర పడేటప్పుడు తప్పించుకొనే చాకచక్యము ఉన్నదా?

14. ప్లీడరుగారి ఇంటిలో పన్నెండుమంది దొంగలు పడగా నెమ్మదిగా వారికి తాళపుచెవులు ఇచ్చివేసి మారువేషముతో వారితో కలిసి స్టేషనుకువెళ్ళి స్టేషన్‌మాష్టరుతో మాట్లాడి వారు ఎక్కినబండినే ఎక్కి వారిని పోలీసుల కప్పగించెను. ఓ విశ్వాసీ! నీ విశ్వాసము చలనము లేకుండ యుండగలదా?

15. బట్లర్ అనేదొర పరమభక్తుడు. క్రీస్తు దేవుడని ఋజువుపరచే గ్రంథములనేకములు వ్రాసెను. తుదకు మరణ సమయమున విశ్వాసముపోయెను. సామాన్యమైన పాదిరివచ్చి గద్దించినపుడు మనసు మారెను. శోధన ఎంతటివారినైనను గజగజ లాడించెను.

16. సౌలు నిరాశపడి చెడగొట్టుకొనెను. ఆత్మహత్య చేసికొనెను. ఆయన అభిషేకింపబడినవాడే, నలుబది సంవత్సరములు రాజ్యమేలినవాడే దేవుని వలన ఏర్పాటైనవాడే ఆత్మపొందినవాడే. శోధన కాలమందు పడిపోయెను. విశ్వాసీ నీవు ఎంత జాగ్రత్తగా నుండవలెను. నిమిష నిమిషమునకు గండములు గలవు.

17. యోనాను చూడుడి. దేవుని పిలుపు పొందినవాడే, నినెవె పట్టణము మారుమనస్సు పొందుటకు మూలకర్తయైన ప్రసంగి. కాని చెట్టునీడ పోయినందున చింతాక్రాంతుడయ్యెను. పరమభక్తుడైనను పడిపోవుట సులువు. విశ్వాసీ! నీ మాట ఏమి? ఇందులో చెప్పబడిన వారికంటె గొప్పవాడవా?

షరా:- నీవు అనే బోధ నీకు కలదు. ఎంతగొప్పవారు పడిపోయినను సరే నేను పడిపోను అని నిశ్చయించుకొనును. విశ్వాసీ పోరాటమునకు ముందే సైతానుతోటి యుద్ధము చేయకముందే దేవుని వాక్యము బాగుగా నేర్చుకొని ప్రార్థనా పూర్వకముగా సిద్ధపడుము. తీరా పాపశోధన వచ్చేటప్పుడు సిద్ధపడలేవు.

క్రైస్తవేతరులు పరిశుద్ధ గ్రంథములోనుండి మొదట చదువవలసినవి.

ఆదికాండము 1-3, 6-9, 37-50 అధ్యాయములు; నిర్గమకాండము 1-20 అధ్యాయములు; లేవికాండము 26 అధ్యా॥; సంఖ్యాకాండము 22-24 అధ్యా; యెహోషువ 1-4అధ్యా॥; న్యాయాధిపతులు 13-16అధ్యా॥; రూతు 1-4అధ్యా; 1సమూ. 1-6,9 10, 16-18అధ్యా॥; 2సమూ. 22అధ్యా॥; 1రాజు. 2,3; 5-10, 17 అధ్యా॥; 2రాజు. 1-8, 13, 19,20 అధ్యా॥

ఎజ్రా. 5 అధ్యా॥; నెహెమ్యా 1,2 అధ్యా॥; ఎస్తేరు 1-10; వరకు; యోబు 1,2,42 అధ్యా॥; కీర్తనలు 1,8,19,22,23,24, 95, 96, 103, 119,121, 136, 150అధ్యా॥; సామెతలు 1-12,13, 14, 29, 30, 31 అధ్యా॥; ప్రసంగి 1-12 వరకు; యెష. 1,2,6,32,38,53,55,66 అధ్యా॥; యిర్మీ 1,3 అధ్యా॥; యెహె. 1,2, 35-39 అధ్యా॥; దాని. 1-12; యోవేలు 1,2 అధ్యా॥; యోనా 1-4అధ్యా; మీకా 7 అధ్యా॥; హబక్కూకు 3; హగ్గయి 1,2 అధ్యా॥; జెకర్యా 14 అధ్యా॥; మలాకీ 1-4 అధ్యా॥.

**మత్తయి, మార్కు, లూకా, యోహాను, అపోస్తలుల కార్యములు**

రోమా. 8-12 అధ్యా॥; 1కొరింథి. 13-15 అధ్యా॥; 2కొరింథి. 8,9,10,12 అధ్యా॥; గలతీ. 5,6 అధ్యా॥; ఎఫెసీ. 1-6; ఫిలిప్పీ 4 అధ్యా॥; 1థెస్స. 1-6 అధ్యా॥; 2థెస్స. 1,2అధ్యా॥ 1తిమోతి 4 అధ్యా॥; 2తిమో. 2 అధ్యా॥; తీతు 3 అధ్యా॥; హెబ్రీ. 11,12,13 అధ్యా॥; యాకోబు 1-5 అధ్యా॥; 1పేతురు 4వ అధ్యా॥; 2పేతురు 3వ అధ్యా॥; 1యోహాను 1-5 అధ్యా॥; యూదా 1వ అధ్యా॥; ప్రకటన 1-22 అధ్యా॥ వరకు.

1) ఓ క్షమాపణ కర్తవైన తండ్రీ! నేను అన్నిటికంటెను, అందరికంటెను, ఎక్కువగా నిన్నే ప్రేమించి, నా మొదటి ప్రేమ నీకిచ్చునట్లు నా స్వభావమును మార్చుము. ప్రభువా! నేను లోకములో నున్న వస్తువులకైనను, జీవరాసులకైనను, మానవుల కైనను, సైతానుకైనను భయపడక నేను ఎల్లప్పుడు నీకు భయపడే కృప దయచేయుము.

2) ఓ ప్రభువా! నేను నీ నామమును వృధాచేయకుండా కాపాడి నీ నామమును గౌరవించి, మహిమపర్చు బ్రతుకు నాకను

గ్రహించుము. ప్రభువా! నేను బైబిలు చదువుటయందును, ప్రార్థించుటయందును, కీర్తనలు పాడుటయందును, గౌరవ బుద్ధితోను, భక్తితోను చేయగల కృప నాకనుగ్రహించుము.

3) ఓ ప్రభువా! ఆరాధన దినమును గౌరవించవలసినదని నీవు సెలవిచ్చినావు. ఆ దినముననే అనేకులు విందులు చేసికొనుచు లేనిపోని గొడవలు మాట్లాడుచున్నారు. ఊళ్ళు వెళ్ళుచున్నారు. బట్టలు కుట్టుచున్నారు. ఇల్లు అలుకుచున్నారు. నామకార్థముగా ప్రార్థించుచున్నారు. పాటలు పాడుచున్నారు. ఆదివారమంటే తక్కిన రోజులుగానే భావించుచున్నారు. ఎంతోమంది పాదుర్లు తమ ఇచ్ఛ నెరవేర్చుకొనే ప్రసంగాలు చేయుచున్నారు. ప్రభువా! అట్టివారిని క్షమించుము. కృప దయచేయుము వారికి వర్తమానము దయచేయుము.

4) ఓ ప్రభువా! తల్లిదండ్రులను, తన్నేవారు, దూషించేవారు, గౌరవించనివారు, సంపాదన ఎత్తుకొనిపోవువారు కలరు. అలాగే రాజులను, కలెక్టరులను పంచాయితీవారిని ఎదిరించి బహుతీవిగా నడుతురు. అంతా వ్యతిరేకము. చాలామంది పంతుళ్ళను, మిషనరీ వారిని, రైల్వేవారిని, రైతులను ఎదిరింతురు. వారినందరిని క్షమించుము. దేవుని తరువాత గొప్ప తల్లిదండ్రులు, తరువాత అధికారులు అని గ్రహించునట్లు చేయుచు, నిన్నుబట్టి వినయ విధేయతలు ప్రేమ, గౌరవము చూపించి, నేను దీర్ఘాయుష్మంతుడుగ వర్థిల్లునట్లు చేయుము.

5) ఓ ప్రభువా! కొందరు పగవుండి భార్యమీద అనుమానపడి ఆమె తల నరుకుట, స్వంత బంధువులలో విరోధముండి చంపుట, కోప నరహంతకులు, అసూయ

నరహంతకులు, స్వహత్య చేసికొనేవారు జబ్బులు సహించలేక, భర్తపోరుపడలేక, అప్పులవారి బాధపడలేక నూతిలోనో, నదిలోనో పడి నరహత్య చేసికొనుచున్నారు. ప్రభువా! నేను నా దుర్గుణములద్వారా నిన్నైనను నీ స్వరూపమందు సృష్టించిన మానవునినైనను మనస్సు నొప్పించి, ఆయాసపర్చక, నీకును, లోకమునకును, ఇష్టముగా బ్రతికే బ్రతుకు నాకనుగ్రహించుము. నా శరీరము నీకు ఆలయము గనుక నేను దానిని శుద్ధీకరించు విషయములోను పోషించు విషయములోను తగిన జాగ్రత్త తీసుకొనే జ్ఞాపకశక్తి దయచేయుము.

6) నీ దృష్టిలో ఎంతమంది యౌవనులు తమ జీవిత చరిత్రను పాడు చేసుకొంటున్నారు. ఇది గొప్ప పాపము, నీచమైన పాపము, ఘోరపాపము. ఎంతోమంది వ్యాధులు తెచ్చుకొని చనిపోవుచున్నారు. వివాహములు గల కుటుంబములు నాశనమగు చున్నవి. తల్లిదండ్రుల వ్యాధులు పిల్లలకు అంటుకొనుచున్నవి. ఇట్టి వారందరికి నీ కృప దయచేయుము. ఓ ప్రభువా! నేను నీవు జతపర్చిన భార్యభర్తలకు మధ్యగావెళ్ళి వారి ఐక్యతను విడదీయకుండను, నీ చిత్తప్రకారము నూతనముగా జతపరచబడే వారిని విడదీయకుండను నన్ను జాగ్రత్తగా కాపాడుము.

7) ఓ దయగల తండ్రీ! నీవు నా ప్రార్థనలు వినుచున్నావు అందుకు స్తోత్రములు. దొంగలు అనేకులు ప్రయాణికులను బాధపెట్టుచున్నారు. స్త్రీల నగలు దోచుకుంటున్నారు. చేలలోపంట దొంగిలించుచున్నారు తోటలలో ఫలములు దొంగిలించుచున్నారు. అందరు నిద్రపోవు చుండగా కన్నములు వేయుచున్నారు. సంతలలో

బజారులలో తక్కువ ఖరీదుగల వాటిని ఎక్కువ లాభమునకు అమ్ముచున్నారు. అట్టివారి నిమిత్తము, వర్తకులందరి నిమిత్తము ప్రార్థించుచున్నాను. ఓ తండ్రీ! నేను నాదికాని ఇతరులదగు దేనినైనను టక్కరితనము వల్లనైనను, కుయుక్తివల్లనైనను దొంగిలించకుండ నీవు నాకిచ్చిన సమస్తమును, సమయమును జాగ్రత్తగా వాడుకొనగల నేర్పు నాకు అనుగ్రహించుము.

8) ఓ ప్రభువా! పరుపు నష్టముతెచ్చేవారు, ఒకరి మంచి పేరు చెడగొట్టేవారు, రహస్య సంగతులు బయటికి తెచ్చువారు, ఒకరిమీద లేనిపోని చెడ్డనేరములు గొప్పవారు ఋజువు పరచిన మాట్లాడక యూరకుండుటయు, నా ఇరుగు పొరుగువారిమీద అబద్ధసాక్ష్యము పలుకకుండ, నా నోటిని భద్రపరచుము. ఓ ప్రభువా! నేను సత్యముగా బ్రతుకుచు సత్యము కొరకే పోరాడుచు చివరకు సత్యముకొరకు హతసాక్షులైన వారి జీవితము నాకు దయచేయుము.

9) దురాశ దుఃఖమునకు చేటు. పొరుగువానిదేమియు ఆశింపకూడదు. మాకున్న దానితోనే తృప్తిపొందవలయును. కొందరు ఏదిచూస్తే అది అడుగుదురు. మనస్సులోనైన ఆశించుదురు. ఇట్టి వాటికి నన్ను దూరపరచుము. నీవు నాకు అనుగ్రహించి పవిత్రమైన మనస్సాక్షిని నా అపవిత్ర ప్రవర్తనద్వారా అపవిత్రపరచి నీవు ఏర్పరచిన ఉద్దేశ్యమునకు వ్యతిరిక్తముగా నడచుచుండగా, నీవు క్షమించి శుద్ధిచేసి క్రమపరచి నీకు లోబడి గౌరవపరచు స్థితి నా మనస్సాక్షికి దయచేయుము. ఓ తండ్రీ! నేను ప్రార్థించవలసిన విషయములు అనేకములున్నవి. పసిపిల్లలలు, తమ తల్లులు, బయటకు వెళ్ళితే పొలములోనికి వెళ్ళితే వారు మంచము మీదనుండి, ఊయలలోనుండి పడే అపాయములకు

లోనగుదురు. కొందరు మరణించుదురు. పసిపిల్లలను యౌవనులను, వృద్ధులను కాపాడుము. వారు చెడ్డ అలవాటులలో పడకుండా విద్యాబుద్ధులను నేర్చుకొనునట్లు నీ కృప దయచేయుము. కూలీలను కాపాడుము. మిల్లులలో పనిచేయువారిని, బొగ్గుగనులలో పనిచేయువారిని, యుద్ధములో పనిచేయువారిని, మేడలు, గోపురములు, సత్రములు కట్టేవారిని, బిక్షకులను, కుమ్మరిపని చేయువారిని అడవిలో పనిచేయువారిని, పుస్తకములు వ్రాయువారిని, అచ్చు ఆఫీసులో పనిచేయువారిని, వైద్యశాలలో పనిచేయువారిని, ఖార్కాణాలలో పనిచేయువారిని దీవించుము. దేశమునేలేవారు, ధర్మపాలనచేసే కృప దయచేయుము. వర్షము వలన తడియువారు, భూకంపముల వలన మరణించువారు, అడవి జంతువుల వలన చచ్చేవారు, అట్టి హానినుండి వారిని తప్పించుము. మనుష్యులందరికి సువార్త ప్రకటింపజేయుము. సువార్త అన్ని భాషలలోను అందరికి వ్యాపింపజేయుమని యేసు ప్రభువుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

1) నిన్ను నీవు ఆనుకొనకుము, 2) బంధువులను ఆనుకొనకుము, 3) నీ స్నేహితులను ఆనుకొనకుము, 4) నీ ఇరుగు పొరుగువారిని ఆనుకొనకుము, 5) నీపేట వారిని ఆనుకొనకుము, 6) నీ ఊరువారిని ఆనుకొనకుము, 7) నీ అధికారులను ఆనుకొనకుము, రాజ్యాధికారులు (సంఘాధికారులు), 8) నీ స్వంత మిషనును ఆనుకొనకుము (గ్రూపుమీద), 9) నీ మతమును ఆనుకొనకుము, 10) చందాలమీద ఆనుకొనకుము, 11) ప్రజాభిమానముమీద ఆనుకొనకుము 12) వృత్తిమీద ఆనుకొనకుము, 13) శరీరబలముమీద ఆనుకొనకుము 14) జ్ఞానముమీద ఆనుకొనకుము.

షరా:- సహోదరుడా! ఈ 14 విషయములమీద ఆనుకొని యుండుటకు, దేవుని నమ్ముటకు కావలసిన విశ్వాస బలమును అనుగ్రహించి, శరీరాత్మల విషయములో తదితరులకంటే శ్రేష్టమైన వాడవుగా జీవించుచు దేవుని మహిమ చూడగలుగుటకు ఆయన తన కృప నీ కనుగ్రహించునుగాక!

నీతోను పరిశుద్ధాత్మతోను ఏక దేవుడుగా పాలించుచున్న నీ కుమారుని పరిముఖముగా మా ప్రార్ధనలు ఆలకించుము. మా ప్రార్ధనలన్నియు నెరవేరే నిమిత్తమై నీ ప్రియకుమారుడును, మా ప్రాణరక్షకుడును, మిక్కిలి త్వరలో రానైయున్న వరునిద్వారా ఆలకించుము.

## ప్రార్థన

1) యేసుక్రీస్తు ప్రభువా! నీ సంగతులు నాకు బోధపరచుము, 2) నా పాపములు క్షమించుము, 3) పాపములో పడకుండాచేయుము, 4) నా వ్యాధి మాన్పుము 5) కష్టములు తొలగించుము, 6) అన్నవస్త్రాదులకు ఇబ్బందిలేకుండ చేయుము, 7) అన్నిటిలో నాకు తోడైయుండుము, 8) నన్ను నా వారిని దీవించుము, 9) పిశాచి కార్యములను లయము చేయుము, 10) అందరికి నీ రక్షణమార్గము బయలుపర్చుము, 11) నీ పనులు వృద్ధిచేయుము, 12) నీ రెండవరాకడకు నన్ను సిద్ధపర్చుము, 13) నన్ను మోక్షములోనికి చేర్చుము, ఓ ప్రభువా! నీకనేక నమస్కారములు ఆమేన్.

## విశ్వాస ప్రార్థనయొక్క లక్షణములు

(1) విశ్వాస ప్రార్థన- మనుష్యునికి శాశ్వత జీవఫల మిచ్చును కీర్తన 1:2,3, (2) విశ్వాస ప్రార్థన- మనుష్యుని ఫలింపజేయును. కీర్తన 2:8, (3) విశ్వాస ప్రార్థన- మనుష్యుని

పరమపురికి చేర్చు నావవంటిది. ఆది. 6:9,10, (4) విశ్వాస ప్రార్థన మనుష్యునికి పాలుతేనెలకంటె అధికబలమిచ్చును. దాని. 1:8-21, (5) విశ్వాస- ప్రార్థన మనుష్యుని క్రీస్తుకు నిజ స్నేహితునిగా జేయును ఆది. 18:23-33, (6) విశ్వాసప్రార్థన- స్తెఫనువలె దీనత్వము గలవానిగా చేయును. కార్య. 7:57-60, (7) విశ్వాసప్రార్థన- తప్పక ప్రతి జవాబునిచ్చును (పౌలు) కార్య. 18:9,10, (8) విశ్వాసప్రార్థన- ప్రపంచమందున్న శక్తులన్నిటికంటె మిక్కిలి బలమైనది. కార్య. 9:40,41 (9) విశ్వాస ప్రార్థన- లోకాధికారులకు భయమును, ఆశ్చర్యమును కలిగించును. కార్య. 5:19,20, (10) విశ్వాసప్రార్థన- మనుష్యునికి దుఃఖములో సంతోషము కలిగించును. కార్య. 16:23,25, (11) విశ్వాసప్రార్థన- ఇహలోకాధికారుల పొరబాటులను దిద్దుటకు ధైర్యమునిచ్చును. 1రాజులు 21:17 -24, (12) విశ్వాసప్రార్థన- జనాంగముల నెదిరించుటకు శక్తినిచ్చును 1రాజులు 18:36-39, (13) విశ్వాసప్రార్థనయే శరీర సంబంధమైన ఆహారము నిచ్చుటకుకూడా శక్తిగలది. 1రాజులు 17:15,16, (14) విశ్వాసప్రార్థనయే మనుష్యునికి నిజ పశ్చాత్తాపమును మారుమనస్సును కలుగజేయును. లూకా. 22:60-62, (15) విశ్వాసప్రార్థన- ప్రపంచ శ్రమలను ఎడబాపుటకు అమోఘమైన సాధనమైనది. ఆది. 39:1-6, (16) విశ్వాసప్రార్థన- మనుష్యుని భక్తులయొద్దకు నడిపించును. ఆది. 20:1-8, (17) విశ్వాసప్రార్థన- ప్రజల దయ, అధికారుల దయ, దేవుని దయ సంపాదించుకొనుటకు ముఖ్యసాధనమైయున్నది. దాని. 2:46-49, (18) విశ్వాసప్రార్థన- సత్ యుద్ధముచేయు యుద్ధోపకరణమైయున్నది. దాని. 3:16-18,

(19) విశ్వాస ప్రార్థనలు చేయుచోట్ల సైతాను ప్రచారములుకూడా చేయు చున్నాడు. ఆది. 39:7-20, (20) విశ్వాస ప్రార్థన సలుపని హృదయము పెద్దపులులుండెడి గుహయును, మిడి నాగులుండెడి పుట్టయునైయున్నది. (21) విశ్వాసప్రార్థన మనుష్యుని పరలోకమునకు చేర్చెడు నిచ్చెన. ప్రక. 4:1-13, (22) విశ్వాస ప్రార్థనయే నరహత్య మొదలగు పాపము నుండి పరిశుద్ధతకై మరలు వారికి పునాదియైయున్నది. దాని. 3:28,29, (23) అనుభవమైనచో మన ప్రభువునేర్పిన ప్రార్థనయే పరిశుద్ధులుండు పరమపురికి ప్రవేశ పెట్టు రాజమార్గము. మత్త. 6:10-15.

**"మీరీలాగు ప్రార్థన చేయుండి" మత్త. 6:9**

**దినమునకు 7 పర్యాయములు స్తుతులు**

| | |
|---|---|
| 1) ఉదయము పడకమీద | దైవలక్షణముల గురించి |
| 2) కాఫీకి ముందు | బైబిలును గురించి |
| 3) భోజనమునకు ముందు | సంఘమును గురించి |
| 4) సాయంకాలము 4గం॥కు | రక్షణను గురించి |
| 5) రాత్రి భోజనమునకు ముందు | చెడుగులేక కీడుతొలగించినందుకు |
| 6) నిద్రపోవుటకు ముందు | ఉపకారమును గురించి |
| 7) అర్ధరాత్రివేళ | గడువులను గురించి |

## దైవలక్షణముల స్తుతి

1) దేవా! అనాది దేవా! నీకు స్తోత్రములు. నిన్ను ఎవ్వరు కలుగజేయలేదు. నీ అంతట నీవే ఉన్నావు, సృష్టింపబడకుండ ఉన్న దేవా, ఈ నీ గొప్ప తనమునకు అనేక స్తోత్రములు.

2) అనంత దేవా! ఎల్లప్పుడు ఉండగల దేవుడవు గనుక నీకు నిత్యమంగళ స్తోత్రములు. నీవు ఎల్లప్పుడు ఉండువాడవు గనుక నీకు అనంత స్తోత్రార్పణలు.

3) నిరాకారుడవైన దేవా! నీకు మహిమ కలుగును గాక. పాపములమైన మేము మా స్థితినిబట్టి నిన్ను చూడలేక పోవుచున్నాము. నీవు మాకు కనబడవు అయినను నీవు మాత్రము మమ్మును చూచుచున్నావు. గనుక నీకు మహిమ, కనబడని తండ్రివైనప్పటికిని దర్శనములలో కొందరికి, స్వప్నములలో కొందరికిని కనబడుచునేయున్నావు. అందుకై నీకు మహిమ నిరాకారుడవైనప్పటికిని నాకు ఉపయోగకరమైన శరీరాకారమును నిర్మించినందులకై నీకు మహిమ మరియు నా ఆత్మకు నిరాకారము దయచేసినావు. అందుచేత ఆకారముగల నా శరీరముతోను, నిరాకారముగల నా ఆత్మతోను నిన్ను మహిమ పరచుచున్నాను.

4) జీవమైయున్న దేవా! నాలోని జీవము నా బలహీనతను బట్టి నిర్జీవ స్థితిలోనికి వచ్చునప్పుడు, తిరిగి నాలో నూతన జీవము పుట్టించుటకై నీ జీవము ధారపోయుదువు గనుక నీకు నిత్యజీవధార స్తోత్రములు.

5) దేవా! నీవు శక్తివైయున్నావు. కాబట్టి మానవులకు జీవరాసులకు శక్తినిచ్చినావు. అందువలన వారు నడువగలరు. పనిచేయగలరు గనుక నీకు కీర్తి కలుగుగాక! మరియు నీవు నన్ను నేటివరకు కాపాడుచు, నడిపించుచు, వృద్ధిలోనికి తీసుకొని వచ్చుచున్న నీ శక్తిని తలంచుకొని స్తుతించుచున్నాను. నా విషయములో ఎంత గొప్ప కష్టమైన పనియైనను, అసాధ్యమైన పనియైనను చేసిపెట్టగలవు గనుక నా శక్తికొలది నిన్ను కీర్తించుచున్నాను.

6) జ్ఞానివైయున్న దేవా! నీ సృష్టిలోని దేవదూతలకు, జీవరాసులకు, మనుష్యులకు జ్ఞానమిచ్చినావు. అట్టి జ్ఞానము వలన అనేక మర్మములు తెలియుచున్నవి. గనుక నీకు మహిమ కలుగును

గాక! మరియు నా కష్టములు, నా కోరికలు నేను నీకు చెప్పుకొనక ముందే నీకు తెలిసేయున్నవి గనుక నా కష్టములు తొలగింపగలవు. నా చిక్కులు విడదీయగల జ్ఞానోపాయము నీకు గలదు. మరియు నీ అపరిమిత జ్ఞానమును నా పరిమితగల జ్ఞానస్థితిలో తెలిసికొనలేను, అయినను నా పరిమిత జ్ఞానమంతటితో నిన్ను మహిమపరచుచు స్తుతించుచున్నాను.

7) పరిశుద్ధుడవైన తండ్రీ! నీవు నన్నును, సమస్త సృష్టిని పరిశుద్ధముగానే కలుగజేసినావు గనుక నీకు ఘనత కలుగును గాక! అయినను పాపప్రవేశమునుబట్టి నాకు అపరిశుద్ధత కలిగెను. అందువలన నీ పరిశుద్ధతను బట్టి నాకు తిరిగి పరిశుద్ధత కలుగ చేయగలవు. గనుక నిష్కళంకమైన మనస్సుతో నిన్ను ఘనపరచుచున్నాను.

8) ప్రేమాస్వరూపివైన తండ్రీ! నిన్ను సంస్తుతించుచున్నాను నీ దానముల మూలముగాను, నీ సహింపు మూలముగాను, నీ నడిపింపు మూలముగాను, మా కష్టములు నివారణచేయు నీ క్రియల మూలముగాను, నీవు మాకుచేయు ఉపకారముల మూలముగాను, మాకు నీవు చూపుచున్న ప్రేమను తలంచుకొని నిన్ను స్తుతించుచున్నాను గాని నా స్తుతి నీ ప్రేమ ఎదుట ఏ మాత్రము! నా అంతరంగమందున్న కృతజ్ఞత నీ అనంత ప్రేమ ఎదుట ఏ మాత్రము! జీవరాసులు ఒకదానినొకటి ప్రేమించుకొనుట మనుష్యులుకూడ ఒకరినొకరు ప్రేమించుకొనుట ఎరుగుదుము, మరియు భూలోకమందలి తల్లిదండ్రులు తమబిడ్డలను ప్రేమించుట కన్న ఎంతో ఎక్కువగా నీవు నన్ను ప్రేమించుచున్నావు గనుక నా హృదయమంతటిలో కూడిన ప్రేమానంద సంస్తుతులు సమర్పించుచున్నాను.

9) న్యాయస్వరూపివైన దేవా! నేను పొరబాటులో నున్నప్పుడు న్యాయమైన రీతిగా నన్ను గద్దించి, ప్రేమతో శిక్షించు దేవుడవు. న్యాయమునుబట్టి నా మనస్పూర్తిగా నీకు ప్రణుతులు చెల్లించుచున్నాను.

10) సర్వవ్యాపివైయున్న తండ్రీ! నీవు పరలోకమందును, భూలోకమందును, అన్ని స్థలములలోను, అన్ని వేళలను ఉండగలవాడవు గనుక నీకు స్తుతులు. నేను ఎక్కడ ఉన్నను నీవు అక్కడుందువు, ఉండగలవు. నీవు నాకు జతగానుండి నాకు సహాయము చేయగలవు నేను ఒంటరిగానున్నానను చింతలేకుండ చేయగలవు. అందువలన నా మనస్సంతటిలోను, హృదయ మంతటిలోను కృతజ్ఞతతో కూడిన స్తుతులు నీకు చెల్లించుచున్నాను.

11) స్వతంత్రుడవైన ప్రభువా! సమస్త కార్యములు నీయంతట నీవు చేయగల తండ్రీ, నీకు మంగళార్చ. ఎవ్వరును నీకు సలహా ఇవ్వనక్కరలేదు. అన్నియు నీ ఇష్టప్రకారమే చేయగలవు. నీమీద ఆధారపడి నాలోని స్వతంత్రతను బట్టి నా కార్యములు చేసికొనగల స్థితి అనుగ్రహించినావు. గనుక నేను స్వతంత్రముగా నిన్నుకొనియాడుచు మంగళార్చ పాడుచున్నాను.

12) వెలుగైయున్న దేవా! సూర్యచంద్ర నక్షత్రములకు వెలుగు ఇచ్చినావు. జీవులలో కండ్లకు వెలుగు ఇచ్చినావు అందువలన కృతజ్ఞతతోకూడిన వందనార్పణలు అర్పించుచు కీర్తించుచున్నాను.

షరా:- నాకు శరీరమును అనుగ్రహించిన దేవా! నీకు స్తుతులు. ఈ శరీరము పాప శరీరమైనందున దీనిని పరిశుద్ధ శరీరముగ మార్చుచున్నావు. తుదకు నాకు మహిమ శరీరము ఇచ్చి నీయొద్దకు తీసికొని వెళ్ళుదువు గనుక నీకు మహిమ, ఘనత కీర్తి ఆర్భాటము, సంకీర్తనము కలుగునుగాక!

దేవా! నీ దివ్యలక్షణములు దేవదూతలకు, మనుష్యులకు ఇచ్చినావు గనుక నీకు ఆర్భాటము కలుగునుగాక! మరియు సృష్టిలోని వస్తువులు పరీక్షించిన నీ సుగుణములు అందులోనున్నవి గనుక నీకు మంగళస్తోత్రములు ఆమేన్.

## అనుదినాను సరణి

1) నీవు తలంచునది చేసినది దేవుని కంటికి మరుగై యుండనేరదని గ్రహించుము. 2) సమస్తమును మర్యాదగాను క్రమముగాను జరగనిమ్ము. 3) ప్రతిపనికి ఒకకాలము నిర్ణయించు కొనుము. 4) ప్రతి పనియు దానికనుకూలకాలమందే చేయుము. 5) క్రమము తప్పక పనిచేయుము. 6) ఈ దినమున చేయవలసిన పని రేపటి వరకు మిగిల్చిపెట్టవద్దు. 7) ప్రతి విషయమును దీర్ఘముగా ఆలోచించిచేయుము. 8) ప్రతి వస్తువును దాని స్థలమందే ఉంచుము. 9) ప్రతిదియు క్రమమైన రీతిలోనే ఉపయోగించుము. 10) నీదికాని వస్తువు తృణమైనను అంటుకొనకుము. 11) విశ్రాంతి దినమును పరిశుద్ధపరచుటకై నిర్ధారణచేసికొమ్ము. 12) నిత్యము కృషిచేయువాడవైయుండుము. 13) కొండెగానిని ఎన్నడును నీ చెంతకు చేరనివ్వకుము. 14) కొండెములు చెప్పు వాడవుగా ఉండకుము, 15) సోమరివాని తల సైతాను నివాస గృహము. 16) సోమరీ! చీమలయొద్దకు వెళ్ళి బుద్ధి తెచ్చుకొనుము. 17) వంచగాని చెంత చేరకుము, 18) సత్యము చెప్పవలసి వచ్చినప్పుడు ఎన్నడును జడియకుము. 19) ఆడినమాట తప్పేవాడవై యుండకుము. 20) పరిశుద్ధత అనగా లోపల శుచిగా యుండుటయే. 21) మంచి అదృష్టివంతునికి పాటుపడుటయే స్వంతజనం. 22) మంచి పుస్తకములే మన మంచి స్నేహితులు.

23) మంచి తలంపులు ఘనులైన స్నేహితులవంటివి. 24) మంచి మాటను ఎవరు చెప్పినను అనుసరింపుము, 25) ఒకనికొకరు ఉపకారులను, కరుణాహృదయులునైయుండుడి. 26) కోపమును రేపు వట్టిమాటలు వచింపకుము. 28) మాట్లాడుట వెండివంటిది, మాట్లాడకుండుట బంగారమువంటిది. 29) అందరితో మాట్లాడుము కొందరినే స్నేహించుము. 30) అందరితో మర్యాదగా ప్రవర్తించుము. 31) పగను సాధించుటకు ప్రయత్నించకుము. 32) ఇతరులు నీకేమి చేయవలెనని కోరుదువో అదేవారికి చేయుము. 33) ఇతరుల నేరములెన్నడును ఎన్నకుము. 34) పొరుగు మంచి ఎప్పుడును బయలుపరచుచుండుము. 35) నీ చెడుగునెప్పుడును తర్కించుచుండుము. 36) తప్పుచేసి లేదని బొంకుట పాపము కూర్చుకొనుటే. 37) నీ స్వంత కష్టములయందు ఓర్పుకలిగి యుండుము. 38) ఇతరులు కలిగించు వాటియందు సహనము కలిగియుండుము. 39) నీకు కలిగిన తొందరలు ఇతరులమీద పెట్టకుము. 40) నీకవసరములేని వస్తువు చౌకగా వచ్చినను కొనకుము. 41) నీవల్ల ప్రత్యుత్తరము కోరువారికి వెంటనే జవాబిమ్ము. 42) పవిత్ర బ్రతుకును మించిన గొప్ప ప్రసంగమింకొకటి లేదు. 43) వెలగల వస్త్రముకాదు గాని నీతివస్త్రము ధరించుకొనుము. 44) నమ్మకమైన మనుష్యుడే దేవుని పరిశుద్ధ సృష్టి. 45) నమ్మకమైన పనివాడు తన యజమానునికి స్నేహితుడు. 46) ప్రాణస్నేహితుడైన వాడు ఒక్కడున్నను చాలు. 47) గర్వము చలికంటె భరించరానిది. 48) వదురుబోతు అవమానమును పొందకపోడు. 49) వచ్చిన వాటికంటె వచ్చునని అనుకొను కష్టములే గొప్పవి. 50) విచారము, ఆతురత, అప్పులు ఆరోగ్యమునకు శత్రువులు. 51) బ్రతుకుటకు

తినుముగాని తినుటకు బ్రతకవద్దు. 52) తప్పుచేయని వారు ఎవరును లేరు, జ్ఞాని చేసినతప్పు మరలచేయడు. 53) ఆదాయము కంటె అధికముగా ఖర్చుచేయువాడు దరిద్రుడే. 54) ఇతరులకు నీ దుఃఖము దాచి సంతోషమునే బయలుపరచుము. 55) కత్తి మెడను వంచగలదు గాని హృదయమును వంచలేదు. 56) హృదయమును వంచ గలిగినది హృదయమే. 57) నీ సంపాదనలో పదియవవంతు దేవునిదని మరువకుము. 58) అభ్యుదయము దైవకాలమని మరువవద్దు. 59) దేవునియొద్దనుండి గొప్ప సంగతులను కనిపెట్టుము. 60) దేవునికొరకు గొప్ప సంగతులను చేయుటకు ప్రయత్నించుము. 61) జ్ఞానార్జితానుభవము కంటె విశ్వాసార్జితానుభవము గొప్పది. 62) నీవు పెండ్లికుమార్తె వరుసలోనున్నావా? 63) నీవు వధువువైయున్నావా? 64) నీవు వధువు సంఘములో నున్నావా?

శ్లోకం శ్రీసభా వధూవరయానమః
శ్రీ ద్వితియాగ మనథామః
శ్రీ తేజోమయ గమన నామః

## ఉపవాస అన్వయ వాక్యములు

1సమూ. 31:13; 2దిన. 20:3; ఎజ్రా. 8:21-23; నెహెమ్యా. 8:1; ఎస్తేరు 4:16; యెషయా 53:3-5; యిర్మీ. 36:9; దాని. 9:3; యోవేలు 1:14;2:13-15; యోనా 3:5; జెఖర్యా 7:5; 8:29; మత్త. 4:2; అపో॥కార్య. 13:3; 27:9.

షరా:- ఉదర, శరీర, శిరో, పాద, వస్త్ర, స్థాన, మనో శుద్ధులు కలిగియుండవలెను.

# ఉపవాస ప్రార్థన దీక్ష

గ్రంథకర్త:

## యం. దేవదాసు అయ్యగారు

గుంటూరు - 2024        చందా 10-00

Bible Mission HQ Guntur

| | | | | |
|---|---|---|---|---|
| మొదటి | ముద్రణ | 1970 | ప్రతులు | 1000 |
| రెండవ | ముద్రణ | 1974 | ప్రతులు | 1000 |
| మూడవ | ముద్రణ | 1980 | ప్రతులు | 2000 |
| నాల్గవ | ముద్రణ | 1985 | ప్రతులు | 1000 |
| ఐదవ | ముద్రణ | 1991 | ప్రతులు | 2000 |
| ఆరవ | ముద్రణ | 1995 | ప్రతులు | 5000 |
| ఏడవ | ముద్రణ | 2001 | ప్రతులు | 5000 |
| ఎనిమిదవ | ముద్రణ | 2007 | ప్రతులు | 5000 |
| తొమ్మిదవ | ముద్రణ | 2012 | ప్రతులు | 3000 |
| పదియవ | ముద్రణ | 2014 | ప్రతులు | 3000 |
| పదకొండవ | ముద్రణ | 2017 | ప్రతులు | 3000 |
| పన్నెండవ | ముద్రణ | 2019 | ప్రతులు | 3000 |
| పదమూడవ | ముద్రణ | 2022 | ప్రతులు | 3000 |
| పదనాలుగవ | ముద్రణ | 2024 | ప్రతులు | 3000 |

**ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బైలుపరచిన**

# బైబిలు మిషను ప్రచురణ

**బైబిలుమిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు - 522509.**

**సెల్ : 9949121777.**